మంగళవారం
21-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 149
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

దేరాబాబాకు మరోసారి పెరోల్

న్యూఢిల్లీ: అత్యాచారం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న దేరా సచ్చా సౌదా ఆశ్రమ అధిపతి గుర్మీత్ రాం రహీమ్ సింగ్ (డేరా బాబా)కు మరోసారి పెరోల్ మంజూరైంది. ప్రస్తుతం రెండు వేర్వేరు అత్యాచార కేసుల్లో రొహతక్‌లోని సునారియా జైల్లో 2017 నుంచి శిక్ష అనుభవిస్తున్న గుర్మీత్‌కు 21 రోజుల పాటు హరియాణా ప్రభుత్వం పెరోల్ మంజూరు చేసింది. డేరా బాబాకు ఇలా పెరోల్ లభించడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. గడిచిన 21 నెలల్లో ఆరోసారి. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పెరోల్‌పై బయటకు వచ్చినప్పుడు గుర్మీత్ కత్తితో కేకు కోస్తూ సంబరాలు చేసుకున్నారు.

బాబుకు బెయిలు

- రాజమహేంద్రవరం జైలుకు అవసరం లేదు
- రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు
- 30న ఏసీబీ కోర్టుకు హాజరుకావాలి
- స్కిల్ కేసులో హైకోర్టు తీర్పు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు బెయిల్ మంజూరైంది. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ టి.మల్లికార్జున్‌రావు సోమవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసులో సెప్టెంబర్ 9వ తేదీన నంద్యాలలో చంద్రబాబును ఏపీ సీఐడీ అరెస్ట్ చేసింది. జ్యుడీషియల్ రిమాండ్ మీద 52 రోజుల పాటు చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఆరోగ్య కారణాలతో మానవతా కోణంలో ఏపీ హైకోర్టు చంద్రబాబుకి అక్టోబర్ 31వ తేదీన నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇచ్చింది. రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా, గురువారం వాదనలు ముగియడంతో తీర్పును ఉన్నత న్యాయస్థానం రిజర్వ్ చేసింది. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్, సీఐడీ తరపున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ నెల 28న చంద్రబాబు రాజమహేంద్రవరం జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదని, గతంలో ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు జస్టిస్ మల్లికార్జున్‌రావు తెలిపారు. రాజకీయ కార్యక్రమాల్లో యథాతథంగా పాల్గొనవచ్చునని వెల్లడించారు. అయితే ఈ నెల 30న ఏసీబీ కోర్టు ముందు చంద్రబాబు హాజరుకావాలని ఆదేశించారు. మొత్తం 39 పేజీలతో కూడిన తీర్పులో న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. స్కిల్ కేసు 2021లో ప్రారంభం కాగా అప్పటి నుంచి చంద్రబాబు ఈ కేసులో జోక్యం చేసుకున్నట్లుగానీ, రికార్డులు టాంపర్ చేసినట్లుగానీ ప్రాసిక్యూషన్ నిరూపించలేదన్నారు. సబ్ కాంట్రాక్టర్ పన్ను ఎగవేస్తే, చంద్రబాబుకు ఏం సంబంధమని న్యాయవాది లూథ్రా చేసిన వాదనతో ఏకీభవిస్తున్నామని, చంద్రబాబుకు ఈ కాంట్రాక్టులో ఉల్లంఘనలు ఉన్నాయని అధికారులు చెప్పారన్న అంశానికి సాక్ష్యాలు లేవన్నారు. ఈ కేసులో ఇప్పటికే 149 మంది సాక్షులను విచారించి 4 వేల పేజీల డాక్యుమెంట్లు సేకరించినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. ఇప్పటికీ ఈ డాక్యుమెంట్లు సీఐడీ అధీనంలో ఉండటంతో చంద్రబాబు వీటిని ట్యాంపర్ చేసే అవకాశం లేదని, జడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న చంద్రబాబు పారిపోయే అవకాశం అంతకన్నా లేదని పేర్కొన్నారు. సాక్షులను చంద్రబాబు ప్రభావితం చేస్తున్నారని సీఐడీ తరపు న్యాయవాదులు చేసిన వాదనలకు ఆధారాలు లేవని, స్కిల్ కేసులో సుజయత్ ఖాన్ ఇచ్చిన వాంగ్మూలంలో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు ప్రాథమిక సాక్ష్యాలు కూడా లేవని జస్టిస్ మల్లికార్జున్‌రావు వెల్లడించారు. మాజీ పీఏ పెండ్యాల శ్రీనివాస్ గైర్హాజరుకు,

- మిగతా 2 లో

కరువుపై నిర్లక్ష్యం

- పట్టించుకోని జగన్ సర్కారు
- తక్షణమే సహాయ చర్యలు చేపట్టాలి
- నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలి
- సీపీఐ 30 గంటల నిరసన దీక్ష ప్రారంభంలో రామకృష్ణ
- సంఘీభావం తెలిపిన కాంగ్రెస్, తదితర పార్టీలు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో తీవ్ర వర్షాభావంతో కరువు విలయతాండవం చేస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు సహాయ చర్యలు చేపట్టాలని సీపీఐ, ఇతర రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కరువుతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వలసల నివారణకు చర్యలు చేపట్టాలని, కృష్ణాజలాల పున:పంపిణీకై కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం 30 గంటల నిరసన దీక్ష ప్రారంభమైంది. దీక్షను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు.

రామకృష్ణ మాట్లాడుతూ కరువుతో ప్రజలు అల్లాడిపోతుంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పంటల పరిశీలన, రైతాంగం, కరువు గురించి సీఎం జగన్ మాట్లాడటం లేదని ధ్వజమెత్తారు. కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు నోరెత్తటం లేదన్నారు. రాష్ట్రంలో 18 జిల్లాల్లో 440 పైచిలుకు మండలాల్లో కరువు సంభవించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం కరువు ప్రాంతాలను పరిశీలించి కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని కామన్‌కోడ్ అమలు చేయాలన్నారు. ప్రతి ఎకరానికి నష్ట పరిహారం ఇవ్వాలని, రైతులు తీసుకున్న అన్ని రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వలసపోతున్న ప్రజల కోసం తక్షణం గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభించి...ఉపాధి కల్పించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సౌకర్యాల కల్పనకు యుద్ధప్రతిపాదిన చర్యలు చేపట్టాలన్నారు. కరువు కారణంగా పశువులకు ఆహారం లభించటం లేదన్నారు. పశుగ్రాసాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించాలన్నారు. ఎక్కడైనా బోర్లు, బావుల్లో నీరు ఉంటే అక్కడ 24 గంటలు కరెంటు సరఫరా చేయాలన్నారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కర్నాటక ఎన్నికలో లబ్ధిపొందేందుకు ఎగువభద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిధులు కేటాయించిన మోదీ ప్రభుత్వం...ఇప్పుడు

- మిగతా 2 లో

ఫిషింగ్ హార్బర్‌లో 40పైగా బోట్లు బూడిద

చితికిన బతుకులు

- రూ.లక్షల విలువైన మత్స్య సంపద అగ్నికి ఆహుతి
- ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని బాధితుల ఆందోళన
- సమగ్ర విచారణ జరిపి మత్స్యకారులకు న్యాయం చేయాలని విపక్షాల డిమాండ్

కాలిపోయిన బోట్లను పరిశీలిస్తున్న జేవీఎస్ఎన్ మూర్తి

పగలు, రాత్రి సమయం తెలియకుండా ఇళ్లు వదిలి, రోజుల తరబడి కుటుంబాలకు దూరంగా సముద్రంలోకి వెళ్లి మత్స్య కారులు పడే కష్టం అంతా ఇంతా కాదు. ప్రాణాలకు గ్యారెంటీ లేని మత్స్యకారుల జీవన విధానం చాలా భిన్నంగా ఉంటుంది. కానీ విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం... ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మత్స్యకారులు బతుకులను చిదిమేసింది.

2లో

దశాబ్దం పూర్తయినా విభజన హామీలకు

దిక్కేది?

- కేంద్రాన్ని గట్టిగా అడగండి
- ఉన్నతాధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం
- 13వ షెడ్యూలుపై నేడు కేంద్ర హోంశాఖ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పది సంవత్సరాలు పూర్తి కావస్తున్నా విభజన హామీలు చాలావరకు అమలుకు నోచుకోనందున కేంద్రాన్ని గట్టిగా నిలదీయాలని సీఎం జగన్ ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్ర విభజన చట్టంలోని 13వ షెడ్యూల్లో పేర్కొన్న అంశాల పురోగతిపై మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో సమావేశం జరగనున్న క్రమంలో సమావేశంలో ప్రస్తావనకు రానున్న అంశాలపై క్యాంపు కార్యాలయంలో సీఎస్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్ర విభజన వల్ల విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం జరిగింది. విభజన జరిగి పదేళ్లు కావొస్తున్నా చట్టంలో పేర్కొన్న అంశాలు అలానే ఉన్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీఎం స్పష్టం చేశారు. అప్పుల్లో 58శాతం ఏపీకి, 42 శాతం తెలంగాణకు కేటాయించారు. కాని రెవిన్యూ పరంగా 58 శాతం తెలంగాణకు, 42 శాతం ఏపీకి వచ్చింది. పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రం ఆదాయాలు ఏ రకంగా పెరుగుతాయి? ప్రత్యేక హోదా హామీని నెరవేర్చలేదు, పోలవరంకు నిధుల రాకలోసమస్యలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం

- మిగతా 2 లో

పశుసంవర్ధక శాఖలో

పోస్టుల భర్తీకి చర్యలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- గ్రామ సచివాలయాలకు అనుబంధం
- డిసెంబరు 31న రాత పరీక్ష
- జనవరిలో నియామక ఉత్తర్వులు
- రెండేళ్ల ప్రొబేషన్ నిబంధన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పశు సంవర్ధకశాఖ సహాయకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియను సోమవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించింది. గ్రామ సచివాయాలకు అనుబంధంగా ఉన్న వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే)ఖాళీగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏంటి సార్.. ఈ అన్యాయం.. ఎన్నికలప్పుడైనా డబ్బులు పంచి పేదరికాన్ని పారదోలే అవకాశం ఇవ్వరా!

మూడేళ్లుగా ఏం చేస్తున్నారు?

బిల్లులు ఎందుకు ఆమోదించడం లేదు

తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం ప్రశ్న

కేరళ పిటిషన్‌పై కేంద్రం, రాజ్‌భవన్‌కు నోటీసులు



న్యూఢిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ తీర్మానించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా మూడేళ్లుగా ఎందుకు జాప్యం చేశారని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం సూటిగా ప్రశ్నించింది. శాసనసభ ఆమోదం తెలిపిన బిల్లులను ఉద్దేశపూర్వకంగానే గవర్నర్‌లు ఆమోదించకుండా నిలువరిస్తున్నారని తమిళనాడు, కేరళ, పంజాబ్ ప్రభుత్వాలు పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బిల్లులకు ఆమోదం తెలపకుండా తమిళనాడు గవర్నర్ మూడేళ్లుగా ఏమి చేస్తున్నారని నిలదీసింది. మరోవైపు కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, ఆయన కార్యాలయంతోపాటు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. బిల్లుల ఆమోదానికి జరుగుతున్న జాప్యానికి కారణాలు వివరించాలని నోటీసుల్లో ఆదేశించింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను

- మిగతా 2 లో

హామీలు అమలు చేయకపోవడంతో

బీఆర్ఎస్‌కు బీటలు

- నిలదీస్తున్న అన్ని వర్గాలు
- ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రతరం
- అరకొరగా దళిత, బీసీ బంధు-డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుకున్నది. ప్రధాన పార్టీలు బీఆర్ఎస్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించి...ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. ఆయా పార్టీల నాయకులు రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. తమ హామీలను ప్రజలకు వివరిస్తున్నారు. బీఆర్ఎస్ గతంలో ప్రకటించిన సంక్షేమ పథకాలే ఇప్పుడు దానికి పెద్ద తలనొప్పిగా మారినట్లు కనిపిస్తోంది. 2018 ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన అనేక హామీలలో చాలా వరకు ఇప్పటికీ అమలు కాలేదు. కొన్ని హామీల ఊసేలేదు. కొన్నింటికి అరకొర

- మిగతా 2 లో

గాజాపై దాడుల్ని నిలిపివేయాలి

ఇజ్రాయిల్‌కు మరోసారి ఐరాస పిలుపు

వాషింగ్టన్: గాజాపై దాడులను తక్షణం నిలిపివేయాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ మరోసారి ఇజ్రాయిల్‌కు పిలుపునిచ్చారు. అక్టోబర్ 7వ తేదీన హమాస్ మిలిటెంట్లు ఆకస్మికంగా ఇజ్రాయిల్‌పై రాకెట్ల వర్షం కురిపించిన అనంతరం ఇజ్రాయిల్ విచక్షణారహితంగా గాజాపై విరుచుకుపడుతోంది. యుద్ధం ప్రారంభమై నెల దాటినా నేటికీ అగ్ని కీలలు ఎగసి పడుతున్నాయి. ఇజ్రాయిల్ సాగిస్తున్న దమనకాండ వల్ల సోమవారానికి గాజాలో 4,506 మంది పిల్లలు, 3,027 మంది మహిళలతో సహా 11,078 మంది మరణించారు. కాగా సుమారు 1,500 మంది చిన్నారులతో సహా దాదాపు 2,700 మంది తప్పిపోయారు. వారంత శిథిలాల కింద చిక్కుకుపోయి చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. అలానే 27,490 మంది పలస్తీనియన్లు గాయపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. రోజు రోజుకి మరణాల సంఖ్య పెరుగుతుండడంతో ఐక్యరాజ్యసమితి ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో మరోసారి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల ను వెంటనే విరమించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే చిన్నపిల్లలు, మహిళలతో సహా 11 వేల మందికి పైగా ప్రాణాలను కోల్పోయారని... గాజాలో మానవతావాద ప్రతిపాదన కింద ఈ యుద్ధం ఇంతటితో విరమించుకోవాలని... ప్రాణనష్టం పెరగడం, పాఠశాలలు, ఆశ్రయాలు అన్నీ నాశనమై గాజా పరిస్థితి దయనీయంగా ఉందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికైనా తక్షణ మానవతావాద ప్రాతిపదికన కాల్పుల విరమణ కోసం పునరుద్ఘాటిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

చితికిన బతుకులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పగలు, రాత్రి సమయం తెలియకుండా ఇళ్లు వదిలి, రోజుల తరబడి కుటుంబాలకు దూరంగా సముద్రంలోకి వెళ్లి మత్స్య కారులు పడే కష్టం అంతా ఇంతా కాదు. ప్రాణాలకు గ్యారెంటీ లేని మత్స్యకారుల జీవన విధానం చాలా భిన్నంగా ఉంటుంది. కానీ విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం... ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మత్స్యకారులు బతుకులను చిదిమేసింది. క్షణాల వ్యవధిలో వ్యాపించిన మంటలు.. మత్స్య కారుల జీవనాధారమైన బోట్లు, ఇతర సామగ్రిని బుగ్గి చేశాయి. ఆదివారం అర్ధరాత్రి వేళ విశాఖలో ఫిషింగ్ హార్బర్ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి ఒడ్డున ఉన్న బోట్లన్నీ దహనమయ్యాయి. మునుపెన్నడూ లేని విధంగా సుమారు 40మెకనైజ్డ్ బోట్లు అగ్నికి ఆహుతయ్యాయి. తొలుత ఒక బోటులో ఎగిసిన మంటలు చుట్టు పక్కల వాటికి కూడా వ్యాపించినట్టు అక్కడి మత్స్యకారులు చెబుతున్నారు. సోమవారం మార్కెట్ కోసం మూడ్రోజుల క్రితం వేటకు వెళ్లొచ్చిన వారంతా మత్స్య సంపదను అవే బోట్లలో నిల్వ చేశారని, ఆ సరుకు కూడా అగ్నికి ఆహుతైందంటున్నారు జాలర్లు. అప్రమత్తమైన స్థానికంగా ఉన్న వారు అగ్నిమాపక, పోలీస్, మత్స్య శాఖ, పోర్ట్ అధికార యంత్రాంగానికి సమాచారమిచ్చారు. స్థానికులంతా మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ సోమవారం తెల్లవారు జాము వరకు మంటలు ఎగసి పడుతూనే ఉన్నాయి.

న్యాయం చేయాలని బాధితులు ఆందోళన

అగ్నిప్రమాదంలో నష్ట పోయిన బాధితులకు న్యాయం చేయాలంటూ మత్స్యకార నాయకులు నిరసన చేపట్టారు. ఫిషింగ్ హార్బర్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ సాయంత్రంలోపు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి తమకు న్యాయం చేయాలన్నారు. బోటుకు రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎం, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రమాద స్థలాన్ని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించి బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం: మంత్రి సీదిరి

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో కాలిపోయిన బోట్లను మంత్రి అప్పలరాజు, మాజీ మంత్రి అవంతి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున్, పోలీస్ కమిషనర్ రవిశంకర్, మత్స్యశాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కొంతమంది ఆకతాయిలు చేసిన పనికి, మత్స్యకార కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. 36 బోట్లు పూర్తిగా, 9 పాక్షింగా దెబ్బతిన్నాయని తెలిపారు. బోటు విలువ బట్టి 80 శాతం నష్టపరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రమాదానికి కారణమైనవారిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, వారికి కఠిన శిక్షలు తప్పవన్నారు. దెబ్బతిన్న ప్రతి బోటు యజమానికి, మత్స్యకారులందరికీ న్యాయం చేయమని సీఎం జగన్ చెప్పారని తెలిపారు. హార్బర్‌లో ఫైర్ సేఫ్టీ, అవుట్ పోస్ట్ కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి అప్పలరాజు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో తొమ్మిది మంది

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లోఅగ్ని ప్రమాద ఘటనకు కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక బోటుపై మద్యం తాగుతూ పార్టీ చేసుకుంటున్న వారికి కావాల్సిన వంటకాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. పార్టీ చేసుకున్న వారు ఎవరు? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. 9 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. పార్టీలో ఒక యూట్యూబర్ కూడా పాల్గొన్నట్లు సమాచారం. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 60కి పైగా మరబోట్లు దగ్ధమైనట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. రాత్రి 11.30 గంటలు దాటిన తరువాత జీరో నంబరు జట్టీలో మంటలు రేగాయి. క్షణాల్లోనే ఇతర బోట్లకు మంటలు వ్యాపించాయి. సాధారణంగా మత్స్యకారులు తమ బోట్లన్నింటినీ హార్బర్‌లోనే లంగరు వేసి ఉంచుతారు. మూడు రోజుల క్రితం సముద్రంపైకి వేటకు వెళ్లిన బోట్లు కూడా ఆదివారం సాయంత్రానికి తీరానికిచేరాయి. వాటిలో రూ.లక్షల విలువ చేసే మత్స్య సంపద బోట్లలోనే ఉంది. ఉదయం వాటిని వేలం వేసి విక్రయించాల్సి ఉంది. ఒక్కో బోటులో సుమారు రూ.5 నుంచి రూ.6 లక్షల విలువైన చేపలున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంలో 53 నుంచి 60 బోట్లు వరకు దగ్ధం కావడంపై విచారం వ్యక్తం చేశారు. మత్స్యకారులకు బోట్లే జీవనాధారమని ఫిషింగ్ హార్బర్ ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం ప్రభుత్వాలకు అందుతున్నప్పటికీ కనీస సౌకర్యాలు చేపట్టకపోవడం సరైందికాదన్నారు. బోట్లు దగ్ధమయిన మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని, ఒక్కో బోటుకు రూ. 50 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, బోట్ల మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్య కార్మికులకు 6 నెలల పాటు జీవనోపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇప్పటికైనా ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిమాపక పరికరాలతోపాటు తగు సిబ్బందిని కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హార్బర్‌లో రక్షణ, భద్రతా చర్యలు చేపట్టాలి: జేవీఎస్ మూర్తి

విశాలాంధ్ర-విశాఖ: అగ్ని ప్రమాదంలో బోట్లు దగ్ధమై నష్టపోయిన బోట్ల యజమానులకు.., వాటిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కళాశీలు ఉపాధి కోల్పోయినందు వల్ల వారికీ నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ప్రమాద స్థలాన్ని ఆయన సందర్శించి, బాధితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ... ఆస్తులు అమ్మి, అప్పులు చేసి బోట్లను సమకూర్చుకున్న మత్స్యకారులు ఈ ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఒక్కోబోటు 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. వారిని పూర్తిస్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నప్పటికీ హార్బర్ లో రక్షణ, భద్రత పరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కనీసం సీసీ కెమెరాలు కూడా లేవన్నారు. పారాదీప్ పోర్టులో అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే అదుపులోకి తెచ్చేందుకు వాటర్ పైప్‌లైన్ వ్యవస్థ ఉందని మత్స్యకారులు చెబుతున్నారని, పెద్ద సంఖ్యలో బోట్లు ఉన్న విశాఖ ఫిషింగ్ హార్బర్లో అటువంటి వ్యవస్థ లేకపోవడం విచారకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, మత్స్యకార్మిక సంఘం నేతలు పి.చంద్రశేఖర్, నాగభూషణం, కూడా వజ్రం, వంక గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అల్‌షిఫా ఆస్పత్రిలో బందీలు

వీడియో విడుదల చేసిన ఐడీఎఫ్

గాజా: గాజాలోని అతిపెద్ద ఆసుపత్రి అయిన అల్ షిఫాను హమాస్ తమ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా వాడుకుంటోందని ఇజ్రాయిల్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆస్పత్రిలోకి ప్రవేశించిన ఇజ్రాయిల్ సైన్యం అక్కడ తనిఖీలు చేపట్టింది. ఆస్పత్రి ఎంఆర్ఐ యూనిట్‌లో పెద్ద ఎత్తున ఆయుధాలను కనుగొంది. అందుకు సంబంధించిన వీడియోను కూడా ఇజ్రాయిల్ రక్షక దళం (ఐడీఎఫ్) ఇప్పటికే విడుదల చేసింది. తాజాగా ఆసుపత్రిలో బందీలను దాచిపెట్టిన ఓ వీడియోను విడుదల చేసింది. అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై మెరుపు దాడికి దిగిన హమాస్ మిలిటెంట్లు... వందల మంది ని తమ బందీలుగా చేసుకున్న విషయం తెలిసిందే. సుమారు 224 మందిని బందీలుగా చేసుకుంది. వారిని అల్ షిఫా ఆసుపత్రిలోకి బలవంతంగా తీసుకెళ్తున్నట్లు ఉన్న వీడియోను ఐడీఎఫ్ 'ఎక్స్'లో విడుదల చేసింది. ఈ దృశ్యాలు అక్టోబర్ 7న ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయినట్లు చూపిస్తోంది. అంతేకాకుండా ఆస్పత్రిలో 55 మీటర్ల పొడవున్న సొరంగాన్ని కూడా ఐడీఎఫ్ గుర్తించింది. గాజాలో సొరంగాలు, బంకర్ల పెద్ద నెట్‌వర్క్ ఉందని ఇజ్రాయిల్ ఆరోపించింది. అయితే... ఇజ్రాయిల్ ఆరోపణల్ని హమాస్ ఖండించింది. సొరంగంపై ఇజ్రాయిల్ సైన్యం చేసిన ప్రకటన పూర్తిగా అబద్ధమని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మునీర్ ఎల్ బార్ష్ పేర్కొన్నారు. ఎనిమిది రోజులుగా ఆస్పత్రిలోనే ఉన్నానని... అలాంటిదేమీ కనిపించలేదన్నారు.

అర్జెంటీనా నూతన అధ్యక్షుడు జేవియర్ మిల్లా

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా కొత్త అధ్యక్షుడిగా జేవియర్ మిల్లా ఎన్నికయ్యారు. ఈ నెల 19వ తేదీన అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో మిల్లాకు 55.8శాతం ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి సెర్గియో మాసాకు 44.2శాతం ఓట్లు పోలయ్యాయి. లా లిబర్టాడ్ అవాంజా నేత అయిన జేవియర్ మిల్లా... తనను గెలిపిస్తే... అర్జెంటీనాలో పెద్ద ఎత్తున మార్పులు తీసుకువస్తానని ఎన్నికల ప్రచారంలో స్పష్టం చేశారు. అర్జెంటీనా ఎన్నికల సమయంలో ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ద్రవ్యోల్బణం 140శాతానికి పెరిగింది. సెర్గియో మాసా ప్రాతినిధ్యం వహిస్తున్న పెరోనిస్ట్ మూవ్‌మెంట్ పార్టీ గత 20 ఏళ్లలో 16 సంవత్సరాల పాటు అర్జెంటీనాను పాలించింది. ఎన్నికల ఫలితాలపై మాసా స్పందిస్తూ ప్రజలు ఈ సారి భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మిల్లాకు అభినందనలు తెలిపారు. త్వరలోనే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల్లో విజయం తర్వాత మిల్లా స్పందిస్తూ... అర్జెంటీనా పునర్నిర్మాణం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 10న ఆయన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. విక్టోరియా విల్లర్రుయెల్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. జేవియర్ రాజకీయాల్లోకి రాక ముందు ప్రొఫెసర్‌గా పని చేశారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో అర్థశాస్త్రం బోధించారు. అలాగే ఆర్థికశాస్త్రం, రాజకీయాలపై అనేక పుస్తకాలను రాశారు.

బీఆర్ఎస్‌కు బీటలు

(మొదటిపేజీ తరువాయి)

నిధులు కేటాయించి చేతులు దులుపుకుంది. పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత బాగా పెరిగింది. మరికొన్ని పథకాల అమలులో జాప్యంపై ప్రజలు మండిపడుతున్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నిక సందర్భంగా కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధు అభాసుపాలైంది. అదే సందర్భంలో బీసీల కోసం తీసుకొచ్చిన బీసీ బంధు రాజకీయ రంగు పులుముకోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది.

అధికారంలోకి వస్తే రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని గత ఎన్నికల్లో కేసీఆర్ హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు భృతి చెల్లించడంతో పాటు ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. గొల్ల కురమలకు గొర్రెల పంపిణీ పథకాన్ని వేగవంతం చేస్తామని చెప్పారు. డీఎస్సీ ప్రకటన, ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు, పీఆర్సీ చెల్లింపులు, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్లు అందకపోవడం వంటి అంశాలలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గిరిజనుల పోడు భూములకు పట్టాల పంపిణీ కూడా పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ హామీలన్నీ పడకేయడంతో కేసీఆర్ సర్కారుపై ప్రజావ్యతిరేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

రైతులకు లక్ష రూపాయల రుణాన్ని దశలవారీగా నాలుగేళ్లలో పూర్తి చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. అరకొర నిధులతో మమ అనిపించారు. రైతులు తీసుకున్న రుణాలకు బ్యాంకులలో వడ్డీలు పెరిగాయి. రైతులపై బ్యాంకు అధికారుల ఒత్తిడి పెరిగింది. చివరకు రైతులు బ్యాంకు అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక రుణాలు చెల్లించాల్సి వచ్చింది. ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు ఇచ్చే పంటపెట్టుబడి రైతుల చేతికి రావడం లేదు. దీనిని బ్యాంకులే జమచేసుకుంటున్నాయి. రైతుల ఖాతాల్లోని డబ్బు జమచేసుకోవద్దని ప్రభుత్వం అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. మొత్తం మీద రుణమాఫీలో కేసీఆర్ సర్కారు పూర్తిగా విఫలమైంది. బీఆర్ఎస్ తాజాగా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో రుణమాఫీ ఊసేలేదు. ఇక ఉద్యోగాలకు సంబంధించి చూస్తే గత మేనిఫెస్టోలో మెగా డీఎస్సీ హామీ ఇచ్చారు. వీటితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు రూ.3016 భృతి చెల్లిస్తామని ప్రకటించారు. కానీ మెగా డీఎస్సీ కాలేదు...టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లన్నీ తప్పుల తడకగా మారాయి. కేసీఆర్ హయాంలో ప్రశ్నపత్రాలు లీక్ సంచలనంగా మారింది. ప్రభుత్వ కొలువుల కోసం ఎదురుచూసిన రైతుకు నిరాశే ఎదురైంది. పరీక్షలు సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వమంటూ నిరుద్యోగులు సర్కారుపై మండిపడ్డారు. కొలువులు రాక కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. తమ భవిష్యత్తు గురించి ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలంటూ నిరుద్యోగులు విడుదల చేసిన కరపత్రాలు సంచలనంగా మారాయి.

ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. గతంలో ప్రతి నెల 1 నుండి 3వతేదీ లోపు జీతాలు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు...జీతాలు ఎపుడు వస్తాయాఅని ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక్కో జిల్లాకు ఒక్కో రోజు జీతాలు చెల్లిస్తున్నారంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలావుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సమయానికి జీతాలు అందకపోవడంతో ప్రభుత్వంపై ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికల సందర్భంగా ఆ నియోజకవర్గ ఓటర్లను ఆకర్షించేందుకు కేసీఆర్ ప్రయోగించిన అస్త్రమే దళితబంధు. దళితుల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిని అరకొరగా తప్ప పూర్తిగా అమలు చేసిన దాఖలాలు లేవు. దళిత బంధు అక్కడక్కడా అమలైనా...అందులో అధికార పార్టీ ఎమ్మెల్యే 20 నుంచి 30శాతం వరకు కమీషన్లు గుంజుకున్నట్లు స్వయానా కేసీఆరే చెప్పారంటే ఎంత అవినీతి జరిగిందో ఆలోచించాలి.

దళితబంధు కింద కేటాయించిన యూనిట్లు కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలే ఎక్కువగా తీసుకున్నారనే విమర్శలు కూడా లేకపోలేదు. దీంతో పాటు బీసీలకు, మైనార్టీల కోసం తీసుకొచ్చిన బీసీ బంధు, మైనార్టీలకు ఆర్థిక సహాయం సైతం ఇదే దారిలో నడిచాయి. అక్కడ ఎమ్మెల్యేలు కమీషన్లు దండుకుంటే ఇక్కడ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, డబ్బులు దండుకున్నారు.

పోస్టుల భర్తీకి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న 1,896 గ్రామ పశు సంవర్థక సహాయకులు (వీఏహెచ్ఏ) భర్తీకి ప్రకటన జారీజేసింది. ఈ పోస్టుల్లో అత్యధికంగా ఉమ్మడి అనంతపురంజిల్లాలోనూ, అతి తక్కువగా విజయనగరంజిల్లాల్లోనూ ఉన్నాయి. డిసెంబరు 11వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. 27వ తేదీన హాల్ టిక్కెట్లను జారీజేసి, 31వ తేదీన కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఎంపికైన వారికి జనవరిలో నియామక పత్రాల్ని అందజేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,896 పోస్టులకు ఉమ్మడి అనంతపురంజిల్లాలో 473, చిత్తూరు జిల్లాలో 100, కర్నూలు జిల్లాలో 252, వైఎస్ఆర్ కడప జిల్లాలో 210, నెల్లూరు జిల్లాలో 143, ప్రకాశం జిల్లాలో 177, గుంటూరు జిల్లాలో 229, కృష్ణా జిల్లాలో 120, పశ్చిమ గోదావరి జిల్లాలో 102, తూర్పుగోదావరి జిల్లాలో 102, విశాఖపట్నం జిల్లాలో 28, విజయనగరం జిల్లాలో 13, శ్రీకాకుళం జిల్లాలో 34 చొప్పున ఖాళీలున్నాయి.

వయోపరిమితి పెంచని ప్రభుత్వం

గ్రామ పశు సంవర్థక సహాయకులు పోస్టులకు కూడా ప్రభుత్వం ఎలాంటి వయోపరిమితి సడలించలేదు. గతంలో ఉన్న తరహాగానే ఓసీ అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్ల మధ్య వయస్కులు దరఖాస్తు చేసేందుకు అర్హులుగా ప్రకటనలో స్పష్టం చేసింది. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది. ఈ పోస్టులకు ఎంపికైన వారికి రెండేళ్లపాటు ప్రొబేషన్ సమయంలో రూ.15 వేలు చొప్పున కన్సాలిడేషన్ పే ఇస్తారు. ఆ తర్వాత రూ.22,460 చెల్లిస్తారు. అభ్యర్థులు ఏపీటీఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. వాటికి నిర్ణీత రుసుమును ఈ నెల 10వ తేదీలోగా చెల్లించి, డిసెంబర్ 11లోగా అప్‌లోడ్ చేయాలి. ఇప్పటికే రెండు విడతల్లో 4,643 ఆర్బీకేల్లో వీఏహెచ్ఏలను నియమించారు. మిగిలిన 1,896 ఆర్బీకేల పరిధిలో వీఏహెచ్ఏల నియామకానికి ప్రభుత్వం ప్రకటన జారీజేయడం నిరుద్యోగులకు కాస్త ఊరటనిచ్చింది. వయోపరిమితిని 47ఏళ్ల వరకు సడలిస్తే, చాలా మంది ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చేదని అంటున్నారు.

డిజిటల్ లైబ్రరీల పోస్టులు భర్తీ చేసేనా ?

గ్రామ, వార్డు సచివాలయాలకు అనుబంధంగా డిజిటల్ లైబ్రరీల పోస్టులు భర్తీ చేస్తామని సీఎం జగన్ ప్రకటించినప్పటికీ, ఇంతవరకు దానిపై కార్యాచరణ లేదు. ఈ పోస్టుల కోసం వేలాది మంది లైబ్రేరియన్ కోర్సులు చదివిన అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఈ పోస్టులు వస్తాయనే ఆశతో పోటీ పరీక్ష కోసం ప్రైవేట్ సంస్థల్లో శిక్షణ పొందుతున్నారు. దానిపై ప్రభుత్వం ఎలాంటి కసరత్తు చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 15 ఏళ్లకుపైగా లైబ్రేరియన్ల పోస్టులు భర్తీచేయలేదు. దీంతో బీఎల్ఐఎస్సీ డిగ్రీలు చేసిన వారికి దిక్కుతోచని స్థితినెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ లైబ్రేరియన్లు 15వేలకుపైగా ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వేగవంతంగా వాటి భర్తీకి ప్రకటన జారీజేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

కరువుపై నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఎన్నికల్లో లబ్ధిపొందటం కోసం కృష్ణా జలాల పున:పంపిణీ అంశాన్ని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ఇప్పటికే సాగునీరు రాక పంటలు వేసుకోలేని పరిస్థితి ఉంటే కాస్తోకూస్తో వచ్చే కృష్ణా నీటిని కూడా అడ్డుకునేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. కృష్ణా జలాల పున:పంపిణీ కోసం కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ చేపట్టిన ఉద్యమానికి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి రావాలని కోరారు.

కరువు బృందాలను పంపాలి: రావుల వెంకయ్య

ఆంధ్రప్రదేశ్‌లో కనీవిని ఎరుగని రీతిలో ఈ ఏడాది కరువు వచ్చిందని ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య చెప్పారు. సహజంగా కరువు ఉండే రాయలసీమతో పాటు కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలు కూడా కరువుబారిన పడ్డాయన్నారు. రాష్ట్రాల్లో ఏ చిన్న సంఘటన జరిగినా కేంద్ర బృందాలను పంపించే మోదీ ప్రభుత్వానికి...ఏపీలో కరువు కనపించటం లేదా అని నిలదీశారు. ప్రధాని మోదీ కేంద్ర బృందాలను ఏపీకి పంపించి ఇక్కడి పరిస్థితిని పరిశీలించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి మేలు జరిగేందుకు ఈ వేదిక నుంచే సమరశంఖం పూరించాలని సూచించారు.

రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే: గిడుగు రుద్రరాజు

రెండు నెలలుగా రాష్ట్రంలో కరువు తీవ్రస్థాయిలో ఉంటే ముఖ్యమంత్రి స్పందించటం లేదని ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. వేరుశనగ రైతు ఎకరాకు రూ.45 వేల పెట్టుబడి పెడితే పంట చేతికిరాక పూర్తిగా నష్టపోయాడని తెలిపారు. పల్నాడు జిల్లా వెలుర్తి మండలంలో దళిత రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఉదంతాన్ని గుర్తుచేశారు. రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో 50 వేల ఎకరాల్లో పంటలు వేస్తే ప్రభుత్వ రికార్డుల్లో కేవలం 10 వేల ఎకరాలు మాత్రమే చూపిస్తున్నారని చెప్పారు. వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సీపీఐ చేసే పోరాటాల్లో కాంగ్రెస్ పార్టీ పాల్గొంటుందని స్పష్టం చేశారు. సీపీఐ నిరసన దీక్షకు సంఘీభావం ప్రకటించారు.

ఏపీపై కేంద్రం కుట్ర: కాటం నాగభూషణం

కృష్ణా జలాల పున:పంపిణీ కోసం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందకుండా కుట్ర చేస్తున్నదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టిందని మండిపడ్డారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేయటం లేదన్నారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయటానికి కేంద్రం చర్యలు తీసుకోవటం లేదన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై సీపీఐ చేపట్టిన 30 గంటల నిరసన దీక్షకు తమ మద్దతు ఉంటుందన్నారు.

దీక్షల ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నీటి యాజమాన్య అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. 122 ఏళ్ల నాటి కరువు పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నట్లు ప్రభుత్వ రికార్డుల ద్వారా తెలుస్తున్నదన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను గుర్తించిన మొదటి రాజకీయ పార్టీ సీపీఐ మాత్రమేనన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, గుజ్జుల ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పి.హరనాథరెడ్డి, అక్కినేని వనజ, డి.జగదీశ్, పి.రామచంద్రయ్య, జంగాల అజయ్‌కుమార్, డేగా ప్రభాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విమల, పెన్మెత్స దుర్గాభవానీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, నాయకుడు నరహరిశెట్టి నరసింహారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె శివారెడ్డి, ఏఐపీఎస్ఓ రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లాల కార్యదర్శులు సి.జాఫర్, ఎం.వేమయ్య, ఒమ్మి రమణ, ఎం.కృష్ణచైతన్య, ఎ.మారుతీ వరప్రసాద్‌తోపాటు 26 జిల్లాలకు చెందిన సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య బృందం అభ్యుదయ గీతాలు ఆలపించింది. ఎండిన మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, మిర్చి తదితర పంటలను దీక్షా శిబిరంలో ప్రదర్శించారు.

మూడేళ్లుగా ఏం చేస్తున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు క్లియర్ చేయలేదని అడిగింది. మూడేళ్లుగా ఏమి చేస్తున్నారని గవర్నర్‌ను ప్రశ్నించింది. 2020 నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. ఇటీవల గవర్నర్ రవి తిప్పి పంపిన 10 బిల్లులను మళ్లీ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. సీఎం స్టాలిన్ ప్రత్యేక సమావేశంలో ఆ బిల్లులకు మళ్లీ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దాంట్లో రెండు అన్నాడీఎంకే సర్కార్ సమయంలో ఆమోదించినవి ఉన్నాయి. తమిళనాడుతో పాటు పంజాబ్, కేరళ రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లపైనా సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో తమిళనాడు గవర్నర్ వైఖరిని నిలదీసింది. అసెంబ్లీలో మళ్లీ బిల్లులు ఆమోదం పొందాయని, వాటిని గవర్నర్‌కు పంపారని, ఆయన ఏమి చేస్తారో చూద్దామని కోర్టు పేర్కొన్నది. ఈ కేసును మళ్లీ డిసెంబర్ ఒకటో తేదీకి వాయిదా వేసింది. కేరళ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన... రాజ్యాంగంలోని ఆర్టికల్ 168 ప్రకారం గవర్నర్‌లు శాసనసభలో భాగమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోర్టుకు విన్నవించారు. అందుకు సంబంధించిన వివరాలను సుప్రీం ధర్మాసనానికి సమర్పించారు. 21 నెలలుగా ఎనిమిది బిల్లులను గవర్నర్ ఆమోదించలేదని గుర్తుచేశారు. కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. పినరయి విజయన్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపడం లేదని సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. వేణుగోపాల్ వాదనలపై స్పందించిన సుప్రీంకోర్టు...విచారణకు రావాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి నోటీసులు జారీ చేసింది. లేదంటే సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతానైనా రావాలని ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

విభజన హామీలకు దిక్కేది?

(మొదటిపేజీ తరువాయి)

నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలు కూడా రాలేదు. మరి విభజన కష్టాల నుంచి రాష్ట్రం ఏవిధంగా బయటకు రాగలుగుతు ంది? పోలవరం, ప్రత్యేక హోదా అంశాలపై సమావేశంలో దృష్టిపెట్టాలి. విభజన వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే విభజన చట్టంలో హామీలు ఇచ్చారు. కాని అవి నెరవేర్చక పోతే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్రం పురోగమిస్తేనే దేశంకూడా పురోగమిస్తుంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ పట్ల కేంద్రం తప్పనిసరిగా ప్రత్యేకత చూపించాల్సిన అవసరం ఉంది. అప్పుడే విభజన నష్టాల నుంచి గట్టెక్కగలుగుతుంది. అధికార వికేంద్రీ కరణ, సమగ్రాభివృద్ధిలో భాగంగా మూడు రాజధానులను ప్రకటించాం. ఈ ప్రాంతాల మధ్య సమతుల్యమైన, సమగ్రమైన అభివృద్ధి మన బాధ్యత. మూడు ప్రాంతాలను అనుసంధానిస్తూ రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి సమగ్రమైన సహకారం, సహాయం అవసరం. దీనికోసం సమావేశంలో కేంద్రాన్ని గట్టిగా కోరాలి. దుగ్గరాజ పట్నం పోర్టు నిర్మాణం, కడపలో స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం హామీ ఇచ్చింది. విశాఖపట్నం నుంచి రాయలసీమ ప్రాంతానికి అత్యంత వేగంగా నడిచే రైళ్లకోసం హై స్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది. విశాఖ రైల్వే జోన్‌అంశంపై కూడా దృష్టిపెట్టాలి. వైజాగ్, విజయవాడ, తిరు పతి ఎయిర్ పోర్టులను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా మారుస్తానన్నారు. విశాఖపట్నంలో నేవీ కార్యకలాపాల వల్ల పౌరవిమానాలకు తీవ్ర ఇబ్బంది వస్తోంది. దీంతో ఎయిర్ పోర్టును వేరేచోటకు బదిలీచేయాల్సిన అవసరం ఏర్పడింది, ప్రస్తుతం భోగాపురం ఎయిర్ పోర్టును నిర్మిస్తున్నందున దీనికి కనెక్టివిటీ అనేది చాలా ముఖ్యం. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజనపై కూడా గట్టిగా అడగాలని జగన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బాబుకు బెయిలు

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు బెయిల్ పరిశీలనకు సంబంధం లేదని స్పష్టంచేశారు. చంద్రబాబుకు ఇచ్చిన మధ్యంతర బెయిల్ నేపథ్యంలో హైదరాబాద్‌లో నమోదైన కేసులో బెయిల్ షరతులు ఉల్లంఘించినట్లుగా పరిగణించడం లేదన్నారు. స్కిల్ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు సీఐడీ ఎటువంటి ఆధారాలు చూపించలేక పోయిందని, నిధులు విడుదల చేయమన్నంత మాత్రాన నేరంలో పాత్ర ఉందని చెప్పలేమని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు తప్పు చేసినట్లు ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంట్ ఆరోపణలు చేసింది కానీ ఆధారాలు చూపలేకపోయిందని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఉన్నది నిజమని, రెండు లక్షల మందికి శిక్షణ ఇచ్చినట్లు సీఐడీ అంగీకరించిందని గుర్తుచేశారు. టీడీపీ ఖాతాకు స్కిల్ స్కామ్ డబ్బులు వచ్చాయని సీఐడీ ఆరోపణలు చేసినప్పటికీ ఆధారాలు చూపించలేకపోయిందని జస్టిస్ మల్లికార్జున్‌రావు వెల్లడించారు.

సమానత్వం, ఆర్థిక పురోగతికే కుల గణన

రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సామాజిక సమానత్వానికి, విద్య, ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చేయడంతో పాటు భావితరాలకు ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న కుల గణన నిర్వహణపై విజయవాడలోని ఒక హోటల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాల ప్రాంతీయ స్థాయి సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా 1872లో జనగణన జరిగిందని, ఆ తర్వాత 1931, 1941లో నిర్వహించిన జనగణన పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. గతంలో కేవలం ఎస్‌సీ, ఎస్‌టీలకు మాత్రమే కుల గణన జరిగిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల్లోని పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో కుల గణనను చేపట్టాలని 2021లో శాసనసభలో తీర్మానం చేసి, కేంద్రానికి ప్రతిపాదనలు పంపించిందని తెలిపారు. ప్రతిపాదన గడువు రెండేళ్లు ముగిసినా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనందున ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వమే కుల గణన సర్వే చేపట్టాలని సీఎం జగన్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారన్నారు. సామాజికంగా, విద్యా పరంగా సంక్షేమ పథకాలను మెరుగ్గా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సామాజిక, విద్య, ఆర్థిక, జీవనోపాధి వంటి అంశాలపై కులాల వారీగా కుల ఆధారిత సమగ్ర గణనను చేపట్టడం జరిగిందన్నారు. సముచిత విధాన నిర్ణయాల అమలు, పథకాల రూపకల్పనకు కుల గణన అవసరం ఎంతో ఉందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కుల గణనలో కుల సంఘాల నాయకుల పాత్ర ఎంతో కీలకమని, వారి భాగస్వామ్యంతోనే కుల గణనను పూర్తిస్థాయిలో నిర్వహించగలుగుతామన్నారు. కుల గణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, ఈ నెల 21 నుంచి మండల, గ్రామ, సచివాలయ స్థాయిలో విస్తృతంగా శిక్షణా తరగతులు నిర్వహించి పూర్తి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి, సమసమాజం దిశగా నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన వర్గ, మత, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిష్మాత్మకంగా కుల గణన కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 605 సచివాలయాల పరిధిలో దాదాపు 4,500 మంది సిబ్బంది, 10,500 మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో నిమగ్నం కానున్నారని, వారికి పూర్తి స్థాయిలో శిక్షణ అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ కుల గణనలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఇతర ఉద్యోగస్తులు తప్పనిసరిగా పాల్గొని, బోగస్ సర్టిఫికెట్లపై దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుల గణన పక్కాగా చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కుల గణనలో వలంటీర్ల ప్రమేయం లేకుండా సచివాలయ, ప్రభుత్వ శాశ్వత ఉద్యోగస్తులను వినియోగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని, వలస కార్మికులు, కూలీలు, సంచార జాతులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలోనూ కులగణన వివరాలను ప్రకటించి అభ్యంతరాలకు అవకాశం కల్పించాలన్నారు. కుల గణన నిర్వహించే పది రోజుల్లో ఒకరోజు సెలవు దినంగా ప్రకటించి అందరూ కార్యక్రమాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ దేశ సంపదపై అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడే కుల గణనకు కుల పెద్దలు, సంఘ నాయకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. షెడ్యూల్ కులాలు తెగలకు రాజ్యాంగ రక్షణ ఉందని, బీసీలకు కూడా రాజ్యాంగ రక్షణ కావాలన్నారు. ప్రైవేట్ రంగాల్లో కూడా బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, కుల గణనపై గ్రీవెన్సెస్ ఆన్ లైన్ యాప్ ఏర్పాటు చేయాలన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషగిరి మాట్లాడుతూ కుల గణనలో కుల పెద్దల సలహాలు తీసుకోవాలని, కుల సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకర్రావు మాట్లాడుతూ ప్రజాసంఘాల భాగస్వామ్యం ఉండాలన్నారు. సదస్సులో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, నగర మేయర్ భాగ్యలక్ష్మి, ఎన్‌టీఆర్, బాపట్ల జిల్లాల జేసీలు డా.సంపత్ కుమార్, శ్రీధర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాల నాయకులు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రుక్మాంగదయ్య, సాంఘిక సంక్షేమాధికారి విజయభారతి, డీఎల్‌డీవో అనూరాధ పాల్గొన్నారు.

మత్స్యకార బాధితులను ఆదుకోండి

విశాఖ ప్రమాదంపై సీఎం జగన్ ఆరా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖపట్నంలో ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమైన ఘటనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో బాధితులను ఆదుకోవాలని, ప్రమాదంపై లోతైన దర్యాప్తు జరిపి కారణాలు వెలికి తీయాలని ఆదేశించారు. మంత్రి సీదిరి అప్పలరాజును ఘటనాస్థలానికి వెళ్లాలని సూచించారు. బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు అండగా ఉండాలని, తగిన విధంగా వారికి సహాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

బాధిత మత్స్యకారులకు కొత్త బోట్లు అందించి ఆదుకోవాలి : లోకేశ్

విశాఖలో మత్స్యకారులకు చెందిన 40బోట్లు, కోట్లాది రూపాయల మత్స్యసంపద అగ్నికి ఆహుతికి కావడం బాధ కలిగించిందని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. అత్యంత సున్నితమైన షిప్ యార్డు ప్రాంతంలో భద్రతాచర్యల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఈ ప్రమాదంలో నష్టపోయిన వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేద మత్స్యకారులైనందున ప్రభుత్వం పెద్ద మనసుతో స్పందించి వారికి కొత్తబోట్లు, మెరుగైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని లోకేశ్ కోరారు.

విచారణ చేపట్టాలి : పవన్ కల్యాణ్

ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ ప్రమాదంలో 40కిపైగా బోట్లు దగ్ధం కావడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదం వల్ల నష్టపోయిన బోట్ల యజమానులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పదేళ్ల అహంకార పాలనను తరిమికొట్టాలి: నారాయణ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: పదేళ్ల అవినీతి, అహంకార పాలనను తరిమికొట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. మాదాపూర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ కావేరి హిల్స్‌లో నారాయణతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి పేరుతో లక్షల ఎకరాల భూమిని దోచుకున్నారని, కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావు, కూతురు కవిత, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులందరూ కలిసి రాష్ట్రాన్ని దోచుకొని ప్రజలపై లక్షల కోట్ల రూపాయల అప్పు భారం వేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం బాగుంటుందని, వామపక్ష పార్టీగా కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్‌కు తాము మద్దతు తెలుపుతున్నామని, మాదాపూర్ ప్రజలు ఆశీర్వదించి కార్పొరేటర్‌గా రెండు సార్లు గెలిపించారని, అదే మాదిరిగా ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఉన్నత చదువు ఎంబీఏ, ఎల్ఎల్‌బీతో హైకోర్టు న్యాయవాదిగా, అనుభవం కలిగిన వ్యక్తిగా ఉన్న జగదీశ్వర్ గౌడ్‌ను గెలిపిస్తారా... 9వ తరగతి చదివిన గాంధీ నియోజకవర్గానికి అవసరమా అనే విషయాన్ని నియోజకవర్గ ప్రజలు, మాదాపూర్ వాసులు ఆలోచించాలని నారాయణ అన్నారు.

ఆలస్యమైనా సత్యమే గెలిచింది

ఇక అసత్యంపై యుద్ధం: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సత్యం గెలిచింది..ఇక అసత్యంపై యుద్ధం మొదలవబోతోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. చంద్రబాబుకి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై లోకేశ్ సోమవారం ఒక ప్రకటనలో స్పందించారు. సత్యమేవజయతే మరోసారి నిరూపితమైంది. ఆలస్యమైనా సత్యమే గెలిచింది. జగన్ కనుసన్నల్లో వ్యవస్థల నిర్వహణపై సత్యం గెలిచింది. చంద్రబాబు నీతి, నిజాయితీ, వ్యక్తిత్వం మరోసారి సమున్నతంగా తల ఎత్తుకుని నిలబడింది. నేను తప్పు చేయను, తప్పు చేయనివ్వను అని బాబు ఎప్పుడూ చెప్పేదే మరోసారి నిజమైంది. చంద్రబాబుపై పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసు, జగన్ కోసం జగన్ వ్యవస్థల ద్వారా బనాయించిందని బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా హైకోర్టు చేసిన వ్యాఖ్యల ద్వారా స్పష్టమైందన్నారు. అరెస్టు చేసి 50 రోజులకి పైగా జైలులో పెట్టి కనీసం ఒక్క ఆధారమూ ఇప్పటికీ కోర్టు ముందు ఉంచలేకపోయిన తప్పుడు కుట్రలు న్యాయం ముందు బద్దలయ్యాయన్నారు. కేసులో ఆరోపించినట్టు డొల్ల కంపెనీలు అనేవి లేవని తేలిపోయిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఖాతాలోకి డబ్బులు పద్దాయనేది పచ్చి అబద్ధమని, వాట్సాప్ మెసేజ్ చాట్ అంతా బూటకమని స్పష్టమైందన్నారు. చంద్రబాబుకి రూపాయి కూడా రాని స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చారనేది అవాస్తవమని న్యాయస్థానమే తేల్చేసిందని తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్‌లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకోసం జర్నలిస్టులు ఆన్ లైన్ విధానంలో రిజిస్టర్ చేసుకోవాలి. పూర్తి వివరాలను http://ipr.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి నమోదు చేయాలి. అర్హులైన జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఏపీ జర్నలిస్టు సంఘాలు ఇప్పటికే సీఎం జగన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలో భాగంగా ముందుగా జర్నలిస్టులు తమ వివరాలను వారి అక్రిడిటేషన్ ఆధారంగా నమోదు చేసుకోవాలి.

భర్తలపై అత్యాచారం కేసు సున్నితమైనది

ఏపీ మహిళా కమిషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భర్తలపై అత్యాచారం కేసుల నమోదు చాలా సున్నితమైన, అవగాహనతో కూడిన అంశమైనందున చట్టంగా రూపొందించే విషయంలో తగిన జాగ్రత్తలతో వ్యవహరించాలని మహిళా కమిషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. భార్యకు ఇష్టం లేకుండా లైంగిక చర్యకు పాల్పడిన భర్తపై అత్యాచారం కేసులు నమోదు చేసే విషయంలో సుప్రీంకోర్టు సూచనల ప్రకారం కేంద్ర హోం శాఖ వివిధ సమూహాల నుంచి అభిప్రాయ సేకరణ కోరింది. వివాహ వ్యవస్థపై దీని ప్రభావం గురించి చర్చించాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా లేఖ అందుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఈ అంశంపై సోమవారం సమగ్రంగా చర్చించింది. చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అధ్యక్షతన కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిషన్ సభ్యులు గజ్జల వెంకటలక్ష్మి, బూసి వినీత, కుమారి గెద్దం ఉమ, రోకియా బేగం ఈ అంశంపై చర్చించారు. లీగల్ కౌన్సిలర్ ఎ.పూజిత యాదవ్ మాట్లాడుతూ మారిటల్ రేప్ కేసులకు సంబంధించి న్యాయస్థానాల్లో కొనసాగుతున్న పరిణామాలను వివరించారు. కమిషన్ సెక్షన్ ఆఫీసర్లు ఎస్‌వీఎస్ శైలజ, బి సంధ్య కేంద్ర హోంశాఖ పంపిన నోట్ వివరాలను వెల్లడించారు. వివాహ వ్యవస్థలో మహిళలపై లైంగిక దాడుల గురించి సోషల్ వర్కర్ జి.దేవి వివరించారు. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం చేస్తున్న చట్టాలు దుర్వినియోగమవుతున్నాయని, దీనిని సాకుగా చూపి కొత్త చట్టాలు చేయటానికి ప్రభుత్వాలు వెనకాడుతున్నాయన్నారు. తమ శరీరంపై స్త్రీలకు హక్కు ఉందని, ఇష్టం లేకుండా భర్తయినా లైంగిక చర్య చేస్తే అత్యాచారం కేసులు నమోదు చేయటం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. స్త్రీల హక్కులను పరిరక్షిస్తూ వివాహ వ్యవస్థ ఒడిదుడుకులకు గురికాకుండా అవగాహన, సామాజిక చైతన్యంతో కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. మహిళా కమిషన్ సభ్యులు లైంగిక సంబంధాల విషయంలో భార్యలపై జరుగుతున్న దాష్టీకం కేసులను వివరించారు.

లోపలున్నా...బయటున్నా ఒకటే

చంద్రబాబు బెయిల్‌పై సజ్జల వ్యాఖ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అనారోగ్య కారణాలతో బెయిల్ పొంది విజయయాత్రలు ఎలా చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సూటిగా ప్రశ్నించారు. స్కిల్ కుంభకోణం కేసుతో సంబంధం లేదని చంద్రబాబు నిరూపించు కోవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనారోగ్య కారణాలు, వయస్సు దృష్ట్యా చంద్రబాబుకు బెయిల్ వచ్చిందని వివరించారు. చంద్రబాబుకు బెయిల్‌పై టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై వారెవరూ నోరు మెదపడం లేదని అన్నారు. రాజకీయ సానుభూతి కోసమే చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, స్కిల్ కుంభకోణంపై స్పష్టమైన ఆధారాలున్నాయని, వాటిని సీఐడీ తరపు న్యాయవాదులు కోర్టులో సమర్పించారన్నారు. ప్రజల సొమ్మును షెల్ కంపెనీల పేరుతో దోచేశారని, వాటితోనే అవినీతి జరిగిందని వివరించారు. ఫేక్ ఇన్వాయిస్‌లతో రూ.241 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. కిలారి రాజేశ్, పెండ్యాల శ్రీనివాస్‌కు నోటీసులిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. స్కిల్ కుంభకోణానికి సంబంధించిన ఫైళ్లపై చంద్రబాబు సంతకాలు చేశారని సజ్జల విమర్శించారు. స్కిల్ కుంభకోణం జరగలేదని చంద్రబాబు తరపు న్యాయవాదులు ఏనాడు కోర్టుల్లో వాదించలేదన్నారు. గంటా సుబ్బారావును ఐదు పదవుల్లో కూర్చోబెట్టి, నిధులు దారిమళ్లించారని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయన్నారు. చంద్రబాబు జైలులో ఉన్నా, బయట ఉన్నా ఒకటేనని వ్యాఖ్యానించారు. ఆయన బయట ఉంటే 2014 నుంచి 2019 వరకు ఏమి చేశాడో చెప్పాల్సి వస్తుందన్నారు. దేశంలోనే కీలక కేసుగా స్కిల్ కుంభకోణం ఉందని, ఈ కేసులో చంద్రబాబు శిక్ష అనుభవించక తప్పదన్నారు. ఈ కేసులో హైకోర్టు కేవలం బెయిల్ మాత్రమే ఇచ్చిందన్నారు. ఫైబర్ నెట్, మద్యం, ఇసుక, ఇన్నర్‌రింగ్ రోడ్డు కుంభకోణాల కేసులను సైతం చంద్రబాబు ఎదుర్కోవాల్సి ఉందన్నారు.

జగన్ రాష్ట్రాన్ని ముంచేసాడు

ఐదేళ్లలో రూ.11 లక్షల కోట్ల అప్పు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల

విశాలాంధ్ర-పార్వతీపురం: మీ బిడ్డను అని, ఒక్క అవకాశం ఇవ్వండని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని ముంచేశాడని, ఐదేళ్లలో జగన్ వల్ల రాష్ట్రానికి 11 లక్షల కోట్ల రూపాయల అప్పు పెరిగిందని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో టీడీపీ బీసీ విభాగం అధ్వర్యంలో బీసీలకు ప్రభుత్వ నమ్మక ద్రోహం-ఐక్య పోరాటం కార్యక్రమాన్ని బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన యనమల మాట్లాడుతూ జగన్ మళ్లీ అధికారంలోకి రావడానికి చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకోవాలన్నారు. చాలాచోట్ల టీడీపీ ఓట్లను తీసివేయడంతో పాటు ఇబ్బడిముబ్బడిగా దొంగ ఓట్లు చేర్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితి దారుణంగా ఉందని, దీన్ని చూస్తే రాష్ట్ర అభివృద్ధి తెలుస్తోందన్నారు. నవరత్నాలు ఒక మాయని తెలిపారు. మాయ మాటలు చెప్పడం వైసీపీ అధినేతకు, నాయకులకు వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. ఇసుక, మైన్స్, మద్యం వంటి ఆదాయాలు ప్రభుత్వ ఖజానాకు కాకుండా జగన్ ఖజానాకు చేరుతోందని ఆరోపించారు. సామాజిక న్యాయం, సాధికారిత గురించి జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ బీసీలను అన్నివిధాలా ఆదుకున్న ఘనత, పదవులు ఇచ్చిన ఘనత, సాధికారిత సాధించిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హయాంలో బీసీలను అన్నివిధాలా ఆదుకున్నామని, గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పెద్ద ఎత్తున పదవులు ఇచ్చినట్లు తెలిపారు. బీసీలకు రాజ్యాంగం కల్పించిన అన్ని అవకాశాలు టీడీపీ ప్రభుత్వాల్లోనే దక్కాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వూరు రామారావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు విజయ్ చంద్ర, భంజదేవ్, నిమ్మక జయకృష్ణ, పరిశీలకులు గోవింద రాజులు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్మన్ డి.శ్రీదేవి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అదారి మోహనరావు, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల పార్టీ నాయకులు జి.రవికుమార్, కొల్లి తిరుపతిరావు, పెంకి వేణునాయుడు తదితర బీసీ నాయకులు, టీడీపీ-జనసేన అభిమానులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు బెయిల్ మంజూరు కావడం పట్ల బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ కార్మిక సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి కె విజయానంద్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై ఆయన స్పందిస్తూ పోరాట కమిటీ తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పి సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సుబ్బిరెడ్డి, కన్వీనర్ పొన్నా.శివయ్య ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఎం యేసోబు, కో కన్వీనర్లు ఎం.బాలకాసి, కట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రోత్ హబ్‌గా విశాఖి

నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రటరీ అనారాయ్

విశాలాంధ్ర-విశాఖ: అన్ని రకాల వనరులున్న విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రటరీ అనా రాయ్ అన్నారు. విశాఖలో సోమవారం గ్రోత్ హబ్ ప్రాంతీయ సదస్సులో ఆమె మాట్లాడుతూ సమ్మిళిత ఆర్థిక విధానాలు, మిషన్ మోడ్ ప్రాజెక్టుల ద్వారా మరిన్ని ప్రయోజనాలు పొందేందుకు విశాఖకు పుష్కల అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో ఉన్న అభివృద్ధి అవకాశాలపై , విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ... బీచ్ టూరిజం, టెంపుల్ టూరిజంపై మరింత దృష్టి సారించాలని సూచించారు. విదేశీ పర్యాటకులను మరింత ఆకర్షించేలా, వారు ఇక్కడ ఎక్కువ రోజులు బస చేసేలా వినూత్న రీతిలో పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని చెప్పారు. 2030, 2047 ఆర్థిక సంవత్సరాల నాటికి దేశంలో 20 నగరాలను గ్రోత్ హబ్‌లుగా గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగా ముందుగా దేశంలో నాలుగు గ్రోత్ హబ్‌లను గుర్తించామని అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ముంబై, సూరత్, వారిణాసిలో పాటు విశాఖ నగరాన్ని కూడా గ్రోత్ హబ్‌గా ఎంపిక చేశామని వివరించారు. 2030, 2047 నాటికి గ్రోత్ హబ్ లక్ష్యాలను చేరుకునేందుకు సమ్మిళిత ఆర్థిక విధానాలతో కూడిన బృహత్తర ప్రణాళికలను అనుసరించాలని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం సెక్రటరీ గిరిజా శంకర్, నీతి ఆయోగ్ నేషనల్ అడ్వైజర్ పార్థసారధి రెడ్డి, మికెన్సీ సంస్థ ప్రతినిధి అభిలేశ్ బాబెల్, విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఐటీడీఏ పీవో కల్పనా కుమారి ప్రత్యక్షంగా పాల్గొనగా... శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, కాకినాడ, రాజమహేంద్రవరం జిల్లాల కలెక్టర్లు శ్రీకేశ్ లఠ్కర్, నిశాంత్ కుమార్, సుమిత్ కుమార్, హిమాన్షు శుక్లా, మాధవీలత వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర- శ్రీశైలం: కార్తీకమాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహా క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో వేచి ఉండటం కనిపించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు పాలు, నీరు, బిస్కెట్లు వంటి అల్పాహారం పంపిణీ చేశారు. సోమవారం సామూహిక గర్భాలయ అభిషేకాలు నిలుపుదల చేసి అందరికీ అలంకార దర్శనాన్ని కల్పించారు. సుమారు 60 వేల మంది పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అంచనా. కాగా కార్తీక మాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాన్ని సాంప్రదాయ పద్ధతిలో వైభవంగా నిర్వహించారు. ముందుగా పుష్కరిణి ప్రాంగణాన్ని దీపాలతో అలంకరించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పుష్కరిణికి దశ విధ హారతులను అర్చక స్వాములు సమర్పించారు.

పూరి గుడిసె దగ్ధం...

చిన్నారి సజీవ దహనం

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలలో అభం శుభం ఎరుగని ఏడేళ్ల చిన్నారి గేమ్మెల నిత్య(7) అగ్నికి ఆహుతి అయింది. కుటుంబ సభ్యులు, అల్లూరి జిల్లా అన్నవరం ఎస్సై రామకృష్ణ అందించిన వివరాలు ప్రకారం. పిండి వంటలు తయారు చేసి అమ్ముకునే నిత్య కుటుంబ సభ్యులు అన్నవరంలో సోమవారం వారపు సంత కావడంతో ప్రతి సోమవారం మాదిరిగానే తెల్లవారుజామునే పొయ్యి ముట్టించగా చలి కాచుకునే ఉద్దేశంతో పొయ్యి వద్ద కూర్చున్న చిన్నారి నిత్య అకస్మాత్తుగా చోటు చేసుకున్న అగ్ని ప్రమాదానికి గురైంది. చిలరేగిన మంటలు క్షణాలలో చిన్నారితో పాటు పూరి గుడిసెకు చుట్టుకోవడంతో పూరి గుడిసె తో పాటు చిన్నారి నిత్య సజీవ దహనమైంది. క్షణాలలో జరిగిన ఈ పరిణామంతో చిన్నారి నిత్య కుటుంబ సభ్యులు బిడ్డతో పాటు సర్వం కోల్పోయారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్యరాస విశ్వేశ్వర రాజు, స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి ,జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైసీపీమండల అధ్యక్షుడు మోరి రవి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు.

సంపాదకీయం

ముస్లింలపై కపట ప్రేమ

సెక్యులర్ పార్టీలని చెప్పుకునే రాజకీయ పార్టీలన్నీ మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింల సంక్షేమం గురించి మాట్లాడని రోజంటూ ఉండదు. కానీ తీరా ఎన్నికల దగ్గరకు వచ్చేటప్పటికి ఏ పార్టీ కూడా ముస్లింలకు తగినన్ని సీట్లు కేటాయించదు. ఉదాహరణకు తెలంగాణలో మొత్తం 119 శాసనసభా స్థానాలు ఉంటే అధికారంలో ఉన్న కె.చంద్రశేఖర రావు (కె.సి.ఆర్.) నాయకత్వంలోని భారతీయ రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్.) – మునుపు తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్.) దగ్గరనుంచి ఏ పార్టీ అయినా ముస్లింలకు టికెట్లు ఇవ్వడానికి సంకోచిస్తూనే ఉంటుంది. బి.ఆర్.ఎస్. తాము ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వారి కోసం "షాదీ ముబారక్" లాంటి పథకాలు అమలుచేస్తున్నామని విదేశాల్లో చదువుకునే ముస్లిం విద్యార్థులకు సహాయం అందిస్తున్నామని చెప్పడంలో ఎన్నడూ అలసిపోదు. కానీ నవంబరు 30వ తేదీన శాసనసభకు పోటీ చేయడానికి బి.ఆర్.ఎస్. కేవలం ఇద్దరు ముస్లింలకే అవకాశం ఇచ్చింది. బోధన్ నుంచి మహమ్మద్ షకీల్‌కు, హైదరాబాద్ పరిధిలోని బహదూర్‌పురా నుంచి అలీ బాక్రీకి మాత్రమే బి.ఆర్.ఎస్. టికెట్లు దక్కాయి. ముస్లింల జనాభా గణనీయంగాఉన్న చోట్ల ఎన్నికల ప్రచారసభల్లో మాత్రం కె.సి.ఆర్.తో సహా కొద్ది నిముషాలైనా ఉర్దూలో ప్రసంగించి ముస్లింలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. తెలంగాణలో ముస్లింల జనాభా దాదాపు 13 శాతం ఉంటుందని అంచనా. తెలంగాణలోని ముస్లిం జనాభాలో దాదాపు సగం మంది హైదరాబాద్, ఆ చుట్టుపక్కలే నివాసం ఉంటారు. కానీ టికెట్ల దగ్గరకు వచ్చేటప్పటికి అధికారంలో ఉన్న పార్టీ కూడా వారిని అంతగా పట్టించుకోదు. మోదీ హయాంలో ఎక్కడా ముస్లింలకు టికెట్లు ఇవ్వడంలేదు కనక తెలంగాణలోనూ ఇవ్వలేదు. 118 సీట్లకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ మాత్రం అయిదుగురికి అవకాశం ఇచ్చింది. బహుజన సమాజ్‌పార్టీ కూడా అయిదుగురికి టికెట్లు కేటాయించింది. తెలంగాణ శాసనసభలో 18 స్థానాలు ఎస్.సి.లకు, 9 సీట్లు ఎస్.టి.లకు రిజర్వు చేశారు కనక ఈ స్థానాల్లో ఎటూ ముస్లింలు పోటీచేసే అవకాశమే ఉండదు. లోకసభ పరిస్థితి కూడా ఇదే. లోకసభలో 84 స్థానాలు ఎస్.సి.లకు, 47 సీట్లు ఎస్.టి.లకు రిజర్వు అయి ఉన్నాయి. అంటే 131 చోట్ల ముస్లింలు పోటీ చేయడానికి అవకాశంలేదు. అసదుద్దీన్ ఒవైసీ నాయకత్వంలోని మజ్లిస్-ఎ-ఇత్తెహదుల్ ముస్లిమీన్ పార్టీకి హైదరాబాద్ ముస్లింలలో తిరుగులేని పలుకుబడిఉంది. శాసనసభలో ప్రస్తుతం మజ్లిస్‌కు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈసారి ఆ పార్టీ 8 స్థానాలకు పోటీచేస్తోంది. అందులో ఒక హిందువుకు కూడా మజ్లిస్ టికెట్ ఇచ్చింది. హైదరాబాద్ కాకుండా గణనీయంగా ముస్లింలు ఉన్న జిల్లాల్లో కూడా మజ్లిస్ సాధారణంగా ఎవరినీ పోటీకి దించదు. దీనికి కారణం లేకపోలేదు. కె.సి.ఆర్. అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి అంటే తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి అసదుద్దీన్ నాయకత్వంలోని మజ్లిస్ ఆచరణలో బి.ఆర్.ఎస్.కు సన్నిహితంగా మెలగుతోంది. నికరంగా పొత్తేమీ లేకపోయినా ఈ రెండు పార్టీల మధ్య కచ్చితమైన అవగాహన మాత్రం ఉంది. మజ్లిస్ అభ్యర్థులు పోటీలో లేని నియోజకవర్గాలలో ముస్లింలు బి.ఆర్.ఎస్.కే ఓటు వేయాలని ఒవైసీ బాహాటంగానే చెప్తుంటారు. టికెట్ల కేటాయింపులో అంతో ఇంతో ముస్లింలకు ప్రాధాన్యం ఇస్తున్న పార్టీలుకూడా వారి జనాభాకు తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కాంగ్రెస్, బి.ఎస్.పి. అయిదుగురేసి ముస్లింలకు టికెట్లు ఇచ్చాయని సంతృప్తి పడదామనుకున్నా ఆ టికెట్లు సైతం దక్కాల్సిన దానిలో సగంకన్నా తక్కువే. మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 45 నియోజకవర్గాలలో ఫలితాలను ప్రభావితం చేయగలిగినంత శక్తి ముస్లిం ఓటర్లకు ఉంది. ముస్లింలు మూకుమ్మడిగా ఒక పార్టీకే ఓటు వేస్తారన్న తప్పుడు సూత్రీకరణ చాలా కాలంగా ప్రచారంలోఉంది. వాస్తవ పరిస్థితి అలాలేదు. అనేక రంగాలలో ముస్లింలు వెనుకబడి ఉన్నారు. వారిలో పేదరికం కూడా ఎక్కువే. ముస్లింలలో పేదల పరిస్థితి కొన్ని చోట్ల ఎస్.సి., ఎస్.టి.లకన్నా హీనంగాఉందని సచార్ కమిటీ నివేదికలో ఎప్పుడో తెలియజేశారు. అయినా ప్రధానమైన రాజకీయ పార్టీలకు ముస్లింలను పోటీకి నిలబెట్టి గెలిపించుకోగలమన్న ధైర్యంలేదు. వారికి రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలన్న దృష్టి పూజ్యమే.

మజ్లిస్ ఎంతసేపూ హైదరాబాద్ మీదే దృష్టి పెడుతుంది తప్ప తెలంగాణలో గ్రామీణ నియోజకవర్గాలలో అరుదుగా మాత్రమే పోటీ చేస్తుంది. బి.ఆర్.ఎస్.తో మజ్లిస్ కు ఉన్న బంధమే దీనికి కారణం అయి ఉండవచ్చు. కానీ ఇటీవలి కాలంలో మజ్లిస్ ఇతర రాష్ట్రాలలో కూడా తమ అభ్యర్థులను రంగంలోకి దించుతున్నారు. గత శాసనసభ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్ లో భారీ సంఖ్యలో మజ్లిస్ అభ్యర్థులను రంగంలోకి దించారు. గెలిచే అవకాశాలు లేవని తెలిసినా తమ పార్టీ పలుకుబడి క్రమంగా పెంచుకోవడానికో లేదా ముస్లిం ఓట్లవల్ల సెక్యులర్ పార్టీల విజయావకాశాలను దెబ్బ తీయడానికో మజ్లిస్ ఈ వ్యూహం అనుసరిస్తున్నట్టుంది. బిహార్ లో అనూహ్యంగా గత శాసనసభ ఎన్నికలలో అయిదుగురు మజ్లిస్ అభ్యర్థులు ఎన్నికయ్యారు. కానీ అందులో నలుగురు ఆ తరవాత లాలూ నాయకత్వంలోని ఆర్.జె.డి.లో చేరిపోయారు. ప్రస్తుతం రాజస్థాన్ ఎన్నికలలో మజ్లిస్ 13 నియోజక వర్గాలలో పోటీ చేస్తోంది. అందులో ఒక ఎస్.టి.అభ్యర్థికి అవకాశం ఇచ్చారు. ఒవైసీ ఇప్పటికే రాజస్థాన్‌లో అనేకసార్లు పర్యటించారు. ఈసారి మజ్లిస్ విద్యావంతులకు, సమాజంలో గౌరవం ఉన్న వారికే రాజస్థాన్‌లో టికెట్లు ఇచ్చింది. కానీ వారిలో చాలామంది రాజకీయాలకు కొత్త. వారు గెలిచే పరిస్థితి లేకపోయినా బీజేపీ గెలవకుండా చూడాలని ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ కు పడవలసిన ముస్లింల ఓట్లు పడకుండా పోతాయి. ఇది కేవలం మజ్లిస్ ను బలోపేతం చేసేవిధానం అనుకోవడానికి వీలులేదు. పరోక్షంగా బీజేపీతో తలపడుతున్న పార్టీల విజయావకాశాలకు విఘాతం కలిగించక తప్పదు. ఈ విలోమ పరిస్థితి ఒక్క తెలంగాణకే పరిమితమైందికాదు. అన్ని రాష్ట్రాలలో పరిస్థితి ఇదే. ఉదాహరణకు 23న పోలింగ్ జరగనున్న రాజస్థాన్ లో ముస్లింల జనాభా పది శాతం ఉంటుంది. ఆ రాష్ట్రంలోని మొత్తం 200 స్థానాల్లో కనీసం 40 సీట్లలో ముస్లింల ఓట్లు కీలకమైనవే. 2013లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఒక్క ముస్లిమైనా గెలవలేదు. కానీ 2018లో కాంగ్రెస్ తరఫున 15 మంది పోటీచేస్తే ఏడుగురు విజయం సాధించారు. 2013లో బీజేపీ నలుగురు ముస్లింలకు అవకాశంఇస్తే ఇద్దరు గెలిచారు. అందులో యూనస్ ఖాన్ మంత్రి కూడా అయ్యారు. ఆయన బీజేపీ నాయకురాలు వసుంధరా రాజే సింధియాకు సన్నిహితులు. 2018లో బీజేపీ ఒక్క ముస్లింకే పోటీచేసే అవకాశం ఇచ్చింది. ఈసారి అదీ లేదు. కర్నాటక ఎన్నికలలో మైనారిటీలలో 90 శాతం మంది కాంగ్రెస్ పక్షాన నిలబడ్డారు. అదే పరిస్థితి ఇప్పుడూ ఉంటుందా అన్నది అసలు ప్రశ్న.

చిరయశస్వి... నటరాజ్ కె.వి.

బి.వి.అప్పారావు

నాటకరంగ ఉద్దండులు, కళా ప్రపూర్ణ పీసపాటి నరసింహమూర్తి, నటరాజ్ కె.వెంకటేశ్వరరావు. అత్యంత ప్రతిభావంతులైన నటులు, చిరయశస్వి కె.వెంకటేశ్వరరావు నట, దర్శక ప్రతిభ చాలా పెద్ద కాన్వాస్ చిత్రించవలసింది. కె.వెంకటేశ్వరరావు మరణించిన (1973) రెండేళ్ల తర్వాత నేను రంగస్థల ప్రవేశం చేశాను. నాకున్న నాటకాభిమానం వలన, వారిద్దరి ప్రతిభా పాటవాల గురించి కొన్ని అంశాలు తెలుసుకోగలిగాను. ముఖ్యంగా, కె.వెంకటేశ్వరరావు శిష్యులు కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్‌రాజా, పిళ్లా అప్పలనాయుడు, ఎస్.కె.మిశ్రో, గొల్లపూడి మారుతీరావువంటి ఆత్మీయుల అనుబంధం వలన అనేక సంఘటనలు నా జ్ఞాపకాలలో నిక్షిప్తమై ఉన్నాయి. బహుశా అందుకే, ఆయన తర్వాత కాలంలో ఎందరో ఆయన నటవారసులు, నటన, దర్శకత్వంలో ఆయనంతటి పేరుప్రతిష్టలు పొందినవారు (ఉదా: చాట్ల శ్రీరాములు, దేవదాస్ కనకాల, గొల్లపూడి, కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్ రాజా గణేశ్ పాత్రో, ఎస్.కె.మిశ్రో వంటివారు) ఎవరూ ఆయన సమగ్ర నాటక ప్రస్తానాన్ని అక్షరబద్ధం చేయలేదని నా అభిప్రాయం.

ఆయన మరణించినా, ఔత్సాహిక నాటకరంగంలో, ఆయన ప్రాసంగికత ఈనాటికీ మిగిలి ఉంది. దాదాపు వంద నాటిక, నాటకాలలో నిబద్ధతతో నటించిన ఉత్తమనటుడు కరి పద్మనాభాచార్యులు. ఆయన వాయిస్ నాటకానికి పనికిరాదని కె.వి.నిష్కర్షగా చెప్పేశారట. కానీ,చిత్రంగా, మరో నాటకంలో అదే పద్మనాభాచార్యుల నటనకు ముగ్ధుడై, ఏకంగా ఆయన ఇంటికే వెళ్లిపోయి క్షమాపణలు చెప్పారట. అంతేకాదు, బావ అని వరస కలిపి (కె.వెంకటేశ్వరరావు శిష్యులలో ఎక్కువమందిని ఆయన 'బావ' అనే పిలిచేవారట) ఒప్పించి, తన దర్శకత్వంలో 'కనక పుష్యరాగం'లో నటింపచేసిన నిష్కామ నటకర్మయోగి ఆయన. ఆ తర్వాత పద్మనాభాచార్యులు కె.వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులైపోయారు. " 'బావ' భౌతిక కాయాన్ని మోస్తూ ఆయన అంత్యక్రియలలో పాల్గొని, ఆయన రుణం కొంత తీర్చుకున్నానని" ఓ సందర్భంలో కన్నీళ్ల పర్యంతమయ్యారు. అంతకన్నా ఓ గురువుకు కావలసిన 'గురుదక్షిణ' ఏముంటుంది. ఎన్నో నాటక సంస్థలు ప్రారంభించి, ఉన్నతంగా తీర్చిదిద్దారు. వాటిలో చివరిది 'బహురూప నట సమాఖ్య' (1971లో). ఆ సంస్థ ద్వారా ఆయన శిష్యులు ప్రధానంగా, ఎస్.కె.మిశ్రో నాటక కార్యక్రమాలలో పాల్గొనడం కె.వెంకటేశ్వరరావు సత్సంకల్పానికీ, చిత్తశుద్ధికీ, నాటకంపై ఆయన మమకారానికీ నిదర్శనంగా నిలిచిఉంది.

ఆయన కుమారుడైన కె.వి.ఎస్.డి.ప్రసాద్, (సాధారణంగా తండ్రి, కొడుకుల అభిరుచులకు భిన్నంగా) తండ్రి స్ఫూర్తితో, ఎ.యూ థియేటర్ ఆర్ట్స్ స్టేజి డైరెక్టరుగా, నాటక రంగంలో రాణించడం అరుదైన చరిత్ర. తండ్రిక నాటకరంగ ప్రసాద్ వారసుడు కావడం, వెంకటేశ్వరరావుకు



నటరాజు ప్రసాదించిన వరమనే చెప్పాలి. వెంకటేశ్వరరావు శిష్యులందరి డైలాగ్ మాడ్యులేషన్‌పైన, ఆయన ప్రభావం పూర్తిగా ఉండేది. దర్శకునిగానే కాదు, నటుడిగా కూడా వెంకటేశ్వరరావు సమ్మోహనశక్తి అలాంటిది. విశాఖ జిల్లా అనకాపల్లిలో ప్రముఖ ఫొటోగ్రాఫర్ కీ.శే. కృష్ణారావు వెంకటేశ్వరరావుకు ప్రాణమిత్రుడు. ఆనాటికి విశాఖపట్నంలో వాణిజ్య, సేవారంగాలలో ప్రముఖులు అనకాపల్లికి చెందిన పిళ్లా అప్పలనాయుడు, కృష్ణారావు ద్వారా, అప్పలనాయుడు (అబ్బాయ్) వెంకటేశ్వరరావుతో మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. అప్పటి 'శ్యామల కళా సమితి' ద్వారా మంచి హాస్యనటునిగా పేరు తెచ్చుకున్న అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో ఎ.యూ థియేటర్ ఆర్ట్స్‌లో నటవిద్యార్థిగా చేరారు. ఆయనకు వెంకటేశ్వరరావు అన్నా, నాటకం అన్నా ఆరోప్రాణం, కానీ, వృత్తి (వాణిజ్యం) కార్యకలాపాలవలన, తాను నటించాల్సిన పాత్రసంభాషణల ధారణపై ఎక్కువ శ్రద్ధ పెట్టలేకపోయేవారట. మంచి హాస్య చతురులైన వెంకటేశ్వరరావు చనువుతో కూడిన ప్రేమతో, "నాకు పోర్షన్ రాదు" అని ఒక అట్టమీద రాయించి అప్పలనాయుడు మెడలో వేశారట. అలాగైనా తన పోర్షన్‌బట్టీపై అప్పలనాయుడు శ్రద్ధ పెడతారని. కానీ, అంతకంటే 'సెన్సాఫ్ హ్యూమర్' ఎక్కువ కలిగిన అప్పలనాయుడు రిహార్సలు గదిలోనికి వచ్చినవెంటనే, "నా బోర్డేది? నా అట్టేది?" అని అందర్నీ అడిగేసరికి, అందరూ నవ్వులతో ఆస్వాదించారట. అలాంటి హాస్యపూరిత సంఘటనలు అప్పలనాయుడు చెబితే వినాలి. నటనపై ఎంతో సీరియస్‌గా ఉండీ, వెంకటేశ్వరరావు మంచి హాస్యంతో ఎందరినో తన అభిమానులుగా మార్చుకున్నారు. ఇక, కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్ రాజా, పైడి కొండల జగన్నాధరావు, ఎస్.కె. మిశ్రో, బొట్టా వేణుగోపాలరావు, కృష్ణచైతన్య, వంకాయల సత్యనారాయణ వంటి విశాఖ అగ్రశ్రేణి నట దర్శకులు, వెంకటేశ్వరరావు శిష్యులు, గొల్లపూడి మారుతీరావు వంటి నాటక, సినీ రచయిత, సినీ నటులకు వెంకటేశ్వరరావుపై ఉన్న విశ్వాసం, అవగాహన మరువలేనిది. విశాఖపట్నం పోర్టు ట్రస్టులో వైద్యునిగా పనిచేసిన కాలంలో, డా.ఆడమ్స్, వెంకటేశ్వరరావుకు వైద్యసేవలందిస్తుండే వారు. ఆ క్రమంలో ఓసారి కనక పుష్యరాగం నాటక రిహార్సలు, చూడడానికి వెళ్లారట. అప్పుడు వెంకటేశ్వరావు నటనచూసి అబ్బుర పడిపోయారట. మచిలీపట్నంలో 1955లో ఆంధ్రనాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు జరిగాయి. ఆత్రేయ రచించిన 'నా బాబు' నాటికలో, నటనకు గాను, 'ఉత్తమ నటుడు' బహుమతి గెలుచుకోవడంతో, ఆయన విజయ పరంపర మొదలైంది. 1958లో ఆత్రేయ సాన్నిహిత్యం వలన, ఆయన నిర్మించిన 'వాగ్దానం' చిత్రానికి సహాయ దర్శకునిగా పనిచేయడమేకాక, ఒక పాత్రలో నటించారు. మళ్లీ 1961లో 'ఇద్దరు మిత్రులు' చిత్రంలో నటించారు. కానీ, విషాదం ఏమిటంటే, వెంకటేశ్వరరావు 'స్వరపేటిక'కు అసూయ, ఆందోళన చెందిన ఒక నటుడి ఒత్తిడిమేరకు వెంకటేశ్వరరావు పాత్రను 'మూగవాణ్ణి' చేసేశారు. ఆనాటి ఆ దుర్మార్గం నేపథ్యం బాగా తెలిసినవారు ఆ సంఘటన గురించి చెబుతారు. తీవ్రంగా మనస్తాపం చెందిన వెంకటేశ్వరరావు, మరో పదకొండేళ్లకు 1972లో 'కన్నె వయసు' చిత్రంలో అద్భుతంగా నటించారు. అతని నటనలోని 'ఈజ్' చూడాలంటే, మా తరం వారికి ఆ పాత్ర ఒక ఆలంబన. బహుశా అందుకేనేమో ఆయన సినిమా అవకాశాలకోసం అర్రులు చాచలేదు.

విజయవాడల 'ర.స.న. సమాఖ్య' స్థాపించడం ద్వారా ఎందరినో గొప్ప నటులుగా తీర్చిదిద్దారు. కె.వెంకటేశ్వరరావు నాటక ప్రస్థానం పరిశీలించినప్పుడు, ఆయన అభిమానులు, శిష్యులు స్మరించుకోవలసిన తొలి మహనీయుడు డా.కె.వి.గోపాలస్వామి. ఎందుకంటే వెంకటేశ్వరావు నట, దర్శక వైదుష్యానికి ఒక 'అకడమిక్ స్టేటస్' సృష్టించినవారు ప్రముఖ నాటక రచయిత, మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు. 'నటరాజ్ కె. వెంకటేశ్వరరావు నటీ, నట సమాఖ్య' పేరుతో నాటక సంస్థను నెలకొల్పారు. ఆ సమాజం ద్వారా తాను రచించిన సంచలన నాటక, నాటికలు, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి, కె.వి. ఆశీస్సులందుకున్నారు. 1979లో, విశాఖవాసి, కీ.శే. బి.ఎస్.చలం నటుడు, నాటక పోషకులు) నటరాజ్, కె.వెంకటేశ్వరరావు స్మారక నాటక కళాపరిషత్ స్థాపించారు. అయిదేళ్లపాటు దిగ్విజయంగా నాటక పరిషత్ నిర్వహించి, గొప్ప ప్రదర్శనలు విశాఖ నాటకాభిమానులు వీక్షించే అవకాశం కల్పించారు. చివరిగా, ఔత్సాహిక నటుడు, దర్శకులు పి.శివప్రసాద్ 'కె.వి.మెమోరియల్ ఆర్ట్స్' సంస్థను నెల కొల్పారు. దాదాపు మూడు దశాబ్దాలుగా అనేక నాటక, నాటిక ప్రదర్శనలిస్తూ ఆయన నటరాజ్ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. ఆ నటరాజమూర్తికి తెలుగు నాటకరంగం నిండు నివాళులర్పిస్తుంది.

ఫోన్: 9347039294

భూత దయ

చింతపట్ల సుదర్శన్

చలికాలం కనుక ఎండలో చురుకులేదు కానీ చురుగ్గా మటన్‌షాపు ముందు తిరుగుతున్నట్లు గ్రామసింహాలు కొన్ని కనిపించకుండా దాక్కొని ఉంటే, కొన్ని కండబలం మీద నమ్మకంతో షాపుకెదురుగ్గా నించొని ఉన్నవి. పన్నెండవ వస్తున్నది. ఇంకా ఒక్క ముక్కా విసిరేయడేం అని కొన్ని చిరాకు పడుతుంటే, కొన్ని తిండి దొరకాలంటే ఎంత ఓర్పు, నేర్పు, శ్రమ కావాలి మనుషులకైనా, మనకైనా అనుకుంటున్నవి. షాపులోనుంచి ఎగిరిపడ్డదో ఎముక చురుగ్గా పరుగెత్తినవన్నీ గ్రామసింహాలు. నడిరోడ్డు మీద గుంపుగా నిలబడ్డవి. ఆత్రంగా షాపులోంచి బైటపడ్డ దానికోసం తొక్కిసలాడాయి. రోడ్డు మీద దూసుకొచ్చింది ఓ కారు. ఆ కారు వెనక మరో కారు, దాని వెనుక ఇంకో కారు దూసుకొచ్చిన కారు దూకుడికి డ్రైవర్ బ్రేకు వెయ్యడంతో వెనుక వస్తున్న కార్లు కూడా ఆగిపోయాయి.

రోడ్డుమీద ఊరకుక్కల గుంపు ఓ బడానాయకుడి కారుకు అడ్డం పడ్డది. గుంపులో ఉన్న డాగీ, కారులో ఉన్నది ఎవరా అనిచూసి వామ్మో 'వీడా' అనుకుంది. చదువురానిది కనక మర్యాద తెలీదు కనక. ఒక్క నిమిషంలో 'ఫ్లాష్ బ్యాక్' లోకి వెళ్లి వచ్చింది. ఈ బడానాయకుడే ఓ ఆర్నెల్ల క్రింద ఇదే రోడ్డుమీద కారులో వచ్చాడు. అప్పుడు ఇలాగే షాప్‌లోంచి రోడ్డు మీదకి విసిరిపడ్డ దానికోసం కుక్కలు గుంపుగా నిలబడ్డాయి. అప్పుడీ

రంగస్థలం

మనిషే అగ్గిరాముడు, పిడుగురాముడు అయి తన కారును ఆపినందుకు అలగాకుక్కలు దారి వెంట మనుషుల్ని నడవనీయడం లేదని, వాళ్ల పిక్కలు పీక్కుతింటున్నాయని అరిచి మున్సిపాలిటీ వాళ్ల బండిని రప్పించి కుక్కలన్నింటినీ పట్టుకుపోయే దాకా వదల్లేదు. ఆనాడు చావుతప్పి కన్నులొట్టబోయిందన్నట్లు పడుతూ లేస్తూ ఎలాగో పారిపోయా. వీడు మళ్లీ అగ్నిహోత్రావధానుడిలా, దుర్వాసుడిలా అంతెత్తు ఎగిరి కుక్కల అంతుతేలుస్తాడు అనుకున్న డాగీ మిగతా కుక్కలు వినిపించుకోవని, ఎమర్జెన్సీని ఏ మాత్రం అర్థచేసుకోవని, బ్రతికుంటే పాచి అన్నమైనా తినవచ్చని గుంపులోంచి బైటకువచ్చి రోడ్డుకి ఎదురుగ్గా గల్లీలో నిలబడి చూడసాగింది. పాపం తోటి వాళ్లంతా ఏమైపోతారో అని దిగులుపడుతూ. కారులోంచి దిగాడు బడా లీడర్. ఇక జేబులోనుంచి సెల్‌ఫోన్ తీస్తాడు అనుకుంది డాగీ. కానీ ఆ మనిషి షాపులోకి వెళ్లాడు. ఏం జరుగుతుందా అని చూడసాగింది డాగీ. ఆ బడా నాయకుడు పెద్ద కవరునిండా మాంసం ముక్కలు తెచ్చాడు. ఎగురుతూ నోళ్లు తెరుస్తున్న కుక్కల నోళ్లవైపు విసిరేయసాగాడు. ఇది లోకంలో ఎనిమిదోవో తొమ్మిదోదో వింత అనుకుంటూ తనూ రోడ్డుమీదకి వచ్చి నోరు తెరిచింది డాగీ. చుట్టూపోగైన జనంతో ఆ లీడరు అన్నాడు. 'నాకు మనుషులన్నా, జంతువులన్నా చిన్నప్పట్నించీ ఎంతో ప్రేమ. ఆకలితో ఎవరు బాధపడుతున్నా చూడలేను. కుక్కలైనా, పిల్లులైనా వాటికీ ప్రాణం ఉంది. ఆకలి ఉంది. మనిషిగా పుట్టినందుకు పరోపకారం చెయ్యాలి. తనకు దొరికిన మాంసపు ముక్కను నవులుతూ ఆ బడా లీడర్ చెప్పింది పూర్తిగా వినలేదు డాగీ. కాని చివర్లో 'మీ ఓటు నాకే' 'ఇదిగో ఈ గుర్తుకే' అంటూ తన ఫోటీ, ఎన్నికల సింబల్ ఉన్న కరపత్రాలను గాలిలోకి విసిరేశాడు. జనం చప్పట్లు కొట్టారు. దొరికిన ముక్కలు నోట కరుచుకుని పరుగులు తీశాయి మిగతా కుక్కలు. డాగీ మాత్రం ఓ కరపత్రాన్ని నోటకరుచుకుని కూలిన ఇంటివైపు రన్నింగ్ చేసింది.అప్పటికే అరుగుమీద ఉన్నది డాంకీ. ఏమిటిది సాయంత్రం దాకా తిరిగీ నమిలీ వచ్చేదానివి అప్పుడే వచ్చేశావేం డాంకీ 'బ్రో' అనడిగింది డాగీ అరుగు ఎక్కుతూ. ఎలక్షన్లు కదా ఎందుకైనా మంచిదని వచ్చేశా. ఈ మధ్య ఓ అభ్యర్థి నామినేషన్ వెయ్యడానికి వెళ్తూ గాడిదను తీసుకు వెళ్లాట్టగా. నన్ను ఎవడైనా తోలుకుపోతాడని భయంతో వచ్చేశా మరి. నువ్వెందుకు 'అర్లీ డాగ్' లా వచ్చావు అంది డాంకీ. ఉచితంగా అన్నీ దొరికితె రోడ్లమీద బలాదూర్ తిరిగే మనుషులమా మనం. తిండికోసం తిప్పలు పడతాం. అది దొరికితె ఎక్కడా పెత్తనాలు చెయ్యకుండా, ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందో, ఏ నాయకుడికి ఎంత మెజారిటీ వస్తుందోనని ఛాలెంజిలు చెయ్యకుండా ఇంటికి వచ్చేస్తాం ఇదిగో ఈ కరపత్రం చూడు అని కరపత్రాన్ని డాంకీ ముందు పెట్టింది డాగీ. ఈ పెద్దమనిషా ఇప్పటికి దేశంలో ఉన్న పార్టీలన్నీ మార్చి ఇక కండువా కప్పే పార్టీ ఏదీ మిగలక 'ఇండిపెండెంట్' గా నామినేషన్ వేశాడు అన్నది డాంకీ. కరపత్రంలో ఫొటోలో ఉన్న మనిషిని చూస్తూ. పార్టీలు లేవు, సిద్ధాంతాలు లేవు. ఏదో ఒక పార్టీలో గెలవాలి లేదా స్వతంత్రంగానైనా 'రెబెల్' గానైనా గెలిచి తీరాలి. గెలుపే కదా అందరి లక్ష్యం. ఏదయితేనేం కాని కడుపు నిండా మటన్ పెట్టించాడు. ఆయనకు బల్లులూ, పిల్లులూ, కుక్కలూ అసలు ప్రాణులన్నింటి మీదా ప్రేమేనంట అంది డాగీ. అవునవును, ఎన్నికలకు ముందు చీమలూ, దోమలూ, గొంగళి పురుగుల్లా కనిపించే మనుషులంతా వరాలిచ్చే దేవుళ్లులా కనపడతారు. బోధి వృక్షం కింద తపస్సు చేయకపోయినా లీడర్లందరికీ బుద్ధుడికిలా భూతదయ తెల్సి వస్తుంది అన్నాడు అరుగు ఎక్కిన అబ్బాయి. అవునవును మనుషులందరికీ ఆకలి, దప్పికా ఉంటాయని, నీలాంటి వాళ్లకు ఉద్యోగం ఇచ్చి తీరాలని, మానవ సేవే మాధవ సేవని ఎన్నెన్ని గుర్తుకొస్తాయో వీళ్లకు తమ ఎన్నికల గుర్తుని ఓటర్లకి గుర్తు చెయ్యాలని అన్నది డాంకీ. పోలింగ్ రోజున ఓటర్లంతా 'ఏక్ దిన్‌కా సుల్తాన్' లు ఆ మర్నాటి నుంచి మళ్లీ చీమలు, దోమలు, గొంగళి పురుగులు, నాలాగా కుక్కలు, నీలాగా గాడిదలు అంతేగా అంది డాగీ.

ఇజ్రాయిల్‌పై అమలుకాని ఐరాస తీర్మానాలు



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

అంతర్జాతీయ శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత గల ఐక్యరాజ్య సమితి (ఐరాస)భద్రత మండలి 1967–1989 మధ్య ఇజ్రాయిల్–పలస్తీనా ఘర్షణకు సంబంధించి 131 తీర్మానాలు చేసింది.(14.5.1948 లో పలస్తీనా విభజన నుండి ఇజ్రాయిల్, పలస్తీనా–అరబ్‌ల మధ్య రాజకీయ వత్తిళ్ళు, సైనిక సంఘర్షణలు, మత వివాదాలున్నాయి). వాటిలో ఎక్కువగా పలస్తీనా సమస్య పరిష్కారానికి ఉద్దేశించినవి. పలస్తీనాలో అరబ్బులు, యూదులు, క్రైస్తవులు నివసించేవారు.

1917 నుండి 1948 వరకు పలస్తీనా బ్రిటిష్ పాలనలో ఉంది. మొదటి ప్రపంచయుద్ధంలో యూదుల మద్దతు కోసం వారికి ప్రత్యేక రాజ్యం ఇస్తామని బ్రిటన్ చెప్పింది. యూదులకు ప్రత్యేక దేశ కోరిక బలపడింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 2.4.1947న బ్రిటన్ ప్రతిపాదన మేరకు ఐరాస సర్వసభ్య సభ 29.11.1947 న 181 వ తీర్మానాన్ని ఆమోదించింది. పలస్తీనాను 14.5.1948 న ఇజ్రాయిల్(యూదు), పలస్తీనా(అరబ్) దేశాలుగా విభజించడం, జెరుసెలం నగరానికి అంతర్జాతీయ స్థాయి కల్పించడం ఆ తీర్మాన సారాంశం. దీన్ని అమెరికా, బ్రిటన్, సోవియట్ దేశాలు సమర్థించాయి. ఈ విభజనతో రెండు మత దేశాలు ఏర్పడతాయని నెహ్రూ దీన్ని వ్యతిరేకించారు. ఈ తీర్మానం యూదులకు మోదాన్ని, అరబ్బులకు, పలస్తీనియన్లకు ఖేదాన్ని కలిగించింది. యూదు ప్రజామండలి నాయకుడు డేవిడ్ బెన్ గురియన్ 14.5.1948 న ఇజ్రాయిల్ స్థాపనను ప్రకటించారు. 14.5.1948 నుండి 1967 వరకు పలస్తీనా భాగాలైన వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరుసెలంలను జోర్డాన్, గాజాను ఈజిప్ట్ పాలించాయి. ఐరాస నిర్ణయానికి మించి 20శాతం ఎక్కువ భూభాగాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించింది. క్రమేపీ 80శాతం పలస్తీనాను దురాక్రమించింది. 1949 ఎన్నికల్లో సనాతన యూదు మతవాద పార్టీల మద్దతుతో బెన్ గురియన్ తిరిగి ప్రధాని అయ్యారు. పలస్తీనాను ఇజ్రాయిల్ గుర్తించలేదు. ఇజ్రాయిల్ మిత్ర దేశాల్లో ఐరాసను నియంత్రించే అమెరికా ప్రధానమైంది.

పలస్తీనా శరణార్థులకు సాయపడాలని 19.11.1948 ఐరాస తీర్మానం 212 నిర్ణయించింది. 5 లక్షల శరణార్థుల బతుకు ముఖ్యం. సభ్య దేశాల చందాలతో వీరికి 3.2 కోట్ల డాలర్ల సహాయం అందించాలని తీర్మానించారు. 1967లో ఆక్రమిత పలస్తీనాను ఇజ్రాయిల్ వదలాలని తీర్మానం 242 ఆదేశించింది. 11.12.1948 తీర్మానం 194ప్రకారం జెరుసెలం పవిత్ర స్థలాలను రక్షించాలి, అందరినీ అనుమతించాలి. స్వస్థలాలకు పోవాలనుకున్న శరణార్థులకు సౌకర్యం కల్పించాలి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం వారి ఆస్తులకు పరిహారం చెల్లించాలి. పలస్తీనా శరణార్థులకు సహాయాన్ని శీఘ్రతరం, తీవ్రతరం చేయడానికి ఫ్రాన్స్, టర్కీ, బ్రిటన్, ఉత్తర ఐర్లండ్, అమెరికాలకు బాధ్యత ఇస్తూ 8.12.1949 తీర్మానం 302(4) చేసింది. 9.12.1949న జెరుసెలంకు అంతర్జాతీయ పాలనను తీర్మానం 303(4) ఏర్పాటు చేసింది. 10.12.1949 న జెరుసలెంకు ఆర్థిక వనరులు చేకూర్చాలని తీర్మానం 356లో పేర్కొన్నారు. పలస్తీనా సహాయ తీర్మానాలను పూర్తిచేయాలని, 30.06.1952 నాటికి మరో 3 కోట్ల డాలర్లు ఇవ్వాలని 2.12.1950 తీర్మానం 393 ఆదేశించింది. అరబ్–ఇజ్రాయిల్ మధ్య శాంతి చర్చలు జరపాలని, పలస్తీనా శరణార్థుల సమస్యను వెంటనే పరిష్కరించాలని 14.12.1950 తీర్మానం 394(4) చెప్పింది. 14.12.1950 న జెరుసెలంకు అందిస్తామన్న 4,96,41,773 డాలర్ల సాయాన్ని 80 లక్షల డాలర్లు తగ్గించి, మరలా 28,79,000 డాలర్లు పెంచి సహాయాన్ని 4,45,20,773 కోట్ల డాలర్లుగా తీర్మానం 468 చేసింది. పలస్తీనా శరణార్థుల సహాయ పర్యవేక్షణకు 1952 లో4, 1953 లో3, 1954 లో2, 1955 లో2, 1956 లో1, 1957 లో3, 1958 లో1, 1959 లో1, 1960 లో5, 1962 లో2, 1963 లో4, 1965 లో4, 1966 లో2 తీర్మానాలను చేశారు. 1967 యుద్ధంలో మానవీయ సహాయానికి 1, జెరుసెలం స్థాయి తగ్గింపును ఖండిస్తూ 1, తీర్మానాలను ఇజ్రాయిల్ అమలుచేయనందుకు విచారం ప్రకటిస్తూ 1, మధ్యప్రాచ్యంలో అధ్వాన్న పరిస్థితిని ప్రస్తావిస్తూ 2, పలస్తీనా శరణార్థులను ఆదుకొమ్మని 2, పలస్తీనా ప్రజల మానవ హక్కుల ఉల్లంఘనను ఖండిస్తూ 1968 లో7, ఐరాస ఆదేశాలను పాటించమని 1970లో 7, శరణార్థుల మానవ హక్కుల రక్షణకు, కిక్కిరిసిన శరణార్థి శిబిరాలకు ప్రజలను తరలించవద్దని 1971లో 5, శరణార్థులకు ఆర్థిక సహాయాన్ని ఆపినందుకు, మానవత్వాన్ని మరిచినందుకు 1972లో 5, ఇజ్రాయిల్ మానవ హక్కుల తిరస్కరణపై 1973లో 4, ప్రకృతి వనరుల దోపిడీని ఆపుతూ, పలస్తీనా గణతంత్ర రక్షణకు 1, 1974 లో పలస్తీనా విమోచన సంస్థ (పి.ఎల్.ఒ.) ను ఐరాసకు ఆహ్వానిస్తూ 2, పి.ఎల్.ఓ స్వయంనిర్ణయ శక్తి, హక్కును గుర్తిస్తూ 3, అణచివేత నిరోధానికి సాయుధ ప్రతిక్రియను సమర్థిస్తూ, ఈ హక్కుకు మద్దతివ్వని ప్రభుత్వాలను విమర్శిస్తూ 3, ఆక్రమిత ప్రాంతాల్లో సహజవనరులపై పలస్తీనాకు హక్కు కల్పిస్తూ 1, 1975లో శాంతి, పలస్తీనా హక్కుల రక్షణలో పి.ఎల్.ఒ.తో చర్చించాలని 3, 1967 యుద్ధం తర్వాత ఆక్రమించిన పలస్తీనా భూభాగాలను తిరిగి ఇవ్వమని 2, పలస్తీనా

సార్వభౌమత్వం, మానవ హక్కుల గుర్తింపునకు 2, 1976లో పలస్తీనా స్వతంత్రత, సార్వభౌమత్వం, మానవ హక్కుల రక్షణకు 6, 1977లో పలస్తీనా భూభాగాలను ఖాళీచేయమని 4, జెనీవ యుద్ధ ఒప్పందాలను గౌరవించి శరణార్థులను రక్షించాలని, పలస్తీనీయుల ఆస్తులను వారికి అప్పజెప్పాలని 4, 1978లో ఇదే ఆదేశాలతో 7, 1979 లో అణ్వాయుధాలను ఉపసంహరించి, పలస్తీనీయుల జీవించే హక్కును కాపాడాలని 9, 1980 లో అదే ఆదేశాలతో 7, 1981 లో పురాతన ప్రాంత తవ్వకాలను ఇజ్రాయిల్ ఆపాలని, పలస్తీనీయుల జీవన పరిస్థితులను మెరుగు పరచాలని, డెడ్–మధ్యధరా సముద్రాల మధ్య కాలువ తవ్వకాన్ని ఇజ్రాయిల్ ఆపాలని 8, 1982లో వెస్ట్ బ్యాంక్, గాజా, గోల్డన్ హైట్స్‌ల ఇజ్రాయిల్ ఆక్రమణను, జెరుసెలంను కలుపుకోడాన్ని ఖండిస్తూ 10, 1983లో ఇజ్రాయిల్ యుద్ధాలకు, ఆక్రమణలకు నిరసనగా ఐరాస సభ్య దేశాలు దానితో దౌత్య సంబంధాలను తెంచుకోవాలని 8, 1984లో ఇజ్రాయిల్ ఆక్రమించిన పలస్తీనా భాగాలలో అభివృద్ధి పథకాలు చేపట్టాలని 7, 1985లో 7, 1986లో మానవ హక్కుల రక్షణకు 4,శాంతి రక్షణకు 1987లో 5, 1988లో 9 తీర్మానాలను చేశారు. 2004లో ఇజ్రాయిల్ పలస్తీనా ఆక్రమణను ఐరాస ధృవీకరించింది. 2012లో పలస్తీనాకు ఐరాసలో సభ్యరహిత పరిశీలిత స్థాయినిచ్చారు. ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతాల్లో పలస్తీనా సార్వభౌమత్వాన్ని పునరుద్ఘాటించారు. 23.12.2016–2334 తీర్మానం పలస్తీనా, తూర్పు జెరుసెలంలో ఇజ్రాయిల్ ఆక్రమణలు చట్టవ్యతిరేకమని ఉద్ఘాటించింది. 2017లో ఇజ్రాయిల్ రాజధానిగా జెరుసెలంను అమెరికా గుర్తింపును ఖండించారు. 2018లో గాజా సరిహద్దు నిరసనలకు ఇజ్రాయిల్ ప్రతిస్పందనను విమర్శించారు. 27.10.2023 న గాజాపై ఇజ్రాయిల్ దాడిని వెంటనే ఆపాలని, గాజాకు ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోరాదని ఐరాస సర్వసభ్యసభ ఇయస్ 10–21 తీర్మానాన్ని ఆమోదించింది. మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌ను సమర్థించింది. తీర్మానంలో ఓటేయలేదు. ఈ వైఖరి తీసుకున్న తొలి భారత ప్రభుత్వం మోదీదే.. పలస్తీనాలో యూదులపై ఇజ్రాయిల్ హింసను, ఆయుధాల ప్రయోగాలను, వెస్ట్ బ్యాంక్, గాజాలలో ఇజ్రాయిల్ ఆక్రమణలను, బీరుట్ విమానాశ్రయంపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ, పలస్తీనా, ఈజిప్టు, ఇరాక్, లెబనాన్, సౌదీ అరేబియా, సిరియా, ట్రాన్స్‌జోర్డాన్, యెమెన్‌లలో యుద్ధవిరమణ, జెరుసెలం పవిత్ర స్థలాల భద్రత, పలస్తీనా శరణార్థుల సంక్షేమం, మానవ హక్కులను, పలస్తీనా స్వతంత్రతను, సార్వభౌమత్వాన్ని గుర్తించమని, ఐరాస తీర్మానాలను పాటించమని కోరుతూ భద్రత మండలి 187 తీర్మానాలను చేసింది. ఐరాస భద్రత మండలిలో చైనా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా శాశ్వత సభ్య, అణ్వస్త్ర ఆయుధ దేశాలు. వీటికి భద్రత మండలిలో వీటో (రద్దు/నిషేధ) హక్కు ఉంది. ఈ దేశాల్లో ఏ దేశం తిరస్కరించినా భద్రత మండలిలో తీర్మానం వీగిపోతుంది. 16.2.1946 నుండి అనేక తీర్మానాలు వీటోకు గురయ్యాయి. రాజు మొండివాడు, బలవంతుడు, దుర్మార్గుడు ఐతే బలహీనుల కుత్తుకల కోత తప్పదు. అమెరికా ఐరాసను నియంత్రించినా కొన్ని వందల పలస్తీనా అనుకూల తీర్మానాలు ఆమోదించారు. ఐతే అవి అమలుకాలేదు. అమెరికా సిగ్గులేకుండా వీటో హక్కును తన అనుచర, ఆక్రమణ దేశాలకు అనుకూలంగా, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ప్రయోగించింది. 2024 లోనూ మతవాద పాలకులే ఇండియా, అమెరికాలలో అధికారం చేపడితే జాతీయ, అంతర్జాతీయ సమాజం అధోగతి పాలవుతుంది. చారిత్రక వ్యక్తుల త్యాగాలను గుర్తుతెచ్చుకొని జనం వ్యవహరించాలి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
సెల్: 9490 20 4545

కాంగ్రెస్‌కు వారసత్వ రాజకీయాలు...

అవినీతే ముఖ్యం

ప్రధాని మోదీ

జైపూర్ : రాజస్తాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు తప్ప మరేమీ ఆలోచించదని, 'సనాతన్'ను నిర్మూలించాలని కోరుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఆరోపించారు. రాజస్తాన్‌లోని పాలి జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌కు అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వం అవసరమని, కాంగ్రెస్‌కు అవినీతి, వారసత్వ రాజకీయాల కంటే ముఖ్యమైనది ఏమీ లేదని నొక్కి చెప్పారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మహిళా వ్యతిరేక మనస్తత్వంతో ఉన్నాయని ఆరోపించారు. 'మహిళలకు రిజర్వేషన్ కల్పించే చట్టం వచ్చినప్పటి నుంచి వారు మహిళలపై ప్రచారం ప్రారంభించారు. అహంకారపూరిత కూటమి నేతలు మన అమ్మానాన్నలు, అక్కాచెల్లెళ్లపై చాలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు' అని అన్నారు. 'బీహార్ ముఖ్యమంత్రి అసెంబ్లీలో మహిళలపై కించపరిచే పదాలు ఉపయోగించారు. కానీ కాంగ్రెస్ నాయకులెవరూ దీని గురించి ఏమీ మాట్లాడలేదు. రాజస్తాన్ ప్రజలు గుర్తించిన కాంగ్రెస్ అసలు ముఖం ఇదేనని' ఆయన తెలిపారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జనాభా నియంత్రణలో మహిళల్లో విద్య ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలో విద్యావంతులైన స్త్రీ సంభోగం సమయంలో తన భర్తను ఎలా నిరోధించవచ్చో స్పష్టమైన వివరణను అందించారు. అనంతరం నితీశ్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు. చాలా వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చినందున ఒక మాజీ ముఖ్యమంత్రిపై బీహార్ ముఖ్యమంత్రి కించపరిచే పదజాలం ఉపయోగించారని మోదీ అన్నారు. 'అతను చాలా వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చినందున అతన్ని అవమానించడంలో నితీశ్ ఆనందం పొందాడు. అది తప్పు అని చెప్పే తెలివి కాంగ్రెస్‌కు లేదు' అని అన్నారు. దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలు, దౌర్జన్య ఘటనలపై కాంగ్రెస్ కళ్లు మూసుకుపోయిందని ప్రధాని ఆరోపించారు. 'ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు తప్ప మరేమీ ఆలోచించదు' అని అన్నారు. ఈ విధానం వల్ల ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో అల్లర్లు, ఉగ్రవాద మనస్తత్వం ఉన్నవారు అభివృద్ధి చెందారని మోదీ అన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు సనాతన్‌ను నాశనం చేయాలని చూస్తున్నాయని తెలిపారు. 'సనాతన్‌ను నాశనం చేయడం అంటే రాజస్తాన్ సంస్కృతిని నాశనం చేయడమే' అని చెప్పారు. సనాతన ధర్మం సామాజిక న్యాయానికి విరుద్ధమని, అందుకే దానిని నిర్మూలించాలని తమిళనాడు యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ సెప్టెంబరులో వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. అతను సనాతన ధర్మాన్ని కరోనా వైరస్, మలేరియా, డెంగీ వైరస్, దోమల వల్ల వచ్చే జ్వరంతో పోల్చాడు. రాష్ట్రంలో పెట్రోలు ధరలు పెరగడానికి కాంగ్రెస్సే బాధ్యత వహించాలని, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత పెట్రో ధరలపై సమీక్ష జరుపుతామన్నారు. బీజేపీ పాలిత హరియానా, ఉత్తర ప్రదేశ్, గుజరాత్ కంటే రాజస్థాన్ పెట్రోలును ఎక్కువ ధరలకు విక్రయిస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఏటా రూ.2 లక్షల ఆదాయంపై పన్ను వసూలు చేసేవారని, ఇప్పుడు రూ.7 లక్షల ఆదాయంపై పన్ను వసూలు చేయడం లేదని ప్రధాని అన్నారు. ప్రత్యక్ష పన్ను తగ్గింపు వల్ల రూ. 2.5 లక్షల కోట్లు ఆదా అయ్యాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొబైల్ డేటా ధర ఇలానే ఉంటే, ఈరోజు ప్రతి నెలా మొబైల్ డేటా కోసం రూ.5 వేలు ఖర్చు చేయాల్సి వచ్చేదని ప్రధాని అన్నారు. నేడు, దేశం మొత్తం అభివృద్ధి లక్ష్యం కోసం పగలు, రాత్రి పని చేస్తోందని, 21వ శతాబ్దంలో భారతదేశం చేరుకునే ఎత్తులో రాజస్తాన్ భారీ పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాజస్థాన్‌లో నవంబరు 25న ఎన్నికలు జరగనుండగా, డిసెంబరు 3న ఫలితాలు వెలువడనున్నాయి.

ఖమ్మం జిల్లాలో ఉత్కంఠ పోరు

పది స్థానాల్లోనూ పోటీ ప్రతిష్ఠాత్మకం

ఖమ్మం బాట పట్టిన ప్రధాన పార్టీల అగ్రనేతలు

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో ఉత్కంఠ పోరు జరుగుతోంది. జిల్లాలోని పది స్థానాల్లోనూ పోటీ , ప్రతిష్ఠాత్మకంగా మారింది.ఎన్నికలు ఈ నెల 30వ తేదీన జరగనున్నాయి. ఎన్నికల తేదీ దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ప్రత్యేకమని చెప్పవచ్చు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గత రెండు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను ఈ జిల్లాల్లో తెలంగాణ సెంటిమెంటు అంతగా పని చేయలేదు. 2014 ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ పార్టీకి ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక స్థానం కొత్తగూడెం నుంచి జలగం వెంకట్రావు గెలుపొందగా, ఆ తర్వాత 2018 లో జరిగిన ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుంచి పువ్వాడ అజయ్ కుమార్ గెలుపొందారు. అంటే బీఆర్ఎస్ కు ఆ ఎన్నికల్లోనూ ఒక స్థానమే లభించింది. తెలంగాణ సెంటిమెంటు బలంగా ఉన్న సందర్భంలో రాష్ట్రమంతా టీఆర్ఎస్ వైపు మొగినప్పటికీ, ఖమ్మం జిల్లాలో మాత్రం కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారు. ఈ ఎన్నికల్లో కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని దాదాపు అన్ని సర్వేలు చెబుతున్నాయి. ఈ సారి ఎన్నికల్లోను బీఆర్ఎస్ పార్టీకి ఒకటి లేదా రెండు స్థానాలు మాత్రమే దక్కే అవకాశాలు ఉన్నాయని కొన్ని సర్వేలు పేర్కొన్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ సీపీఐ కలిసి పోటీ చేస్తుండగా, సీపీఎం వేరుగా పోటీలో ఉంది. బీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తోంది. జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర ఈ మూడు నియోజకవర్గాల్లో పోటీ ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క స్థానం కూడా బీఆర్ఎస్ కు దక్కనివ్వనని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రచార కో కన్వీనర్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శపథం చేసిన విషయం తెలిసిందే. దానికి అనుగుణంగానే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు జరిగాయి . మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సహా అనేక మంది ప్రముఖులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాలేరు నియోజకవర్గ నుంచి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి పోటీ చేస్తుండగా , ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పై పోటీ చేస్తున్నారు. ఇక మధిర నుంచి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కాంగ్రెస్ పక్షాన రంగంలో ఉండగా , బీఆర్ఎస్ అభ్యర్థిగా లింగాల కమల్రాజు పోటీలో ఉన్నారు. ఇక్కడ సీపీఎంకి ఓటు బ్యాంకు ఉంది. ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థిని రంగంలో నిలిపింది . కాంగ్రెస్‌తో పొత్తు చెడినందున విక్రమార్కను ఓడిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. పాలేరులో తమ్మినేని వీరభద్రం రంగంలో ఉన్నందున అక్కడ కూడా భారీగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలు తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో బీఆర్ఎస్ తరపున ఒక్కరిని కూడా గెలవనీయనని చెప్పిన పొంగులేటిని ఏ విధంగానైనా ఓడించాలన్న వ్యూహంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థిగా కందాల ఉపేందర్ రెడ్డి రంగంలో ఉన్నారు . ఆయన పాలేరు నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి, ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరారు. ఇప్పుడు బీఆర్ఎస్ టికెట్ పైనే పోటీ చేస్తున్నారు. ఇక ప్రతిష్ఠాత్మకంగా మారిన మరో స్థానం సత్తుపల్లి . ఇక్కడ సండ్ర వెంకట వీరయ్యను ఓడించేందుకు డాక్టర్ మట్ట రాగమయిని కాంగ్రెస్ రంగంలోకి దింపింది. ఈ నియోజకవర్గంలో భారీగా తెలుగుదేశం పార్టీ ఓట్లు ఉన్నాయి. ఆ ఓటర్లంతా తుమ్మల నాగేశ్వరరావుకు మద్దతుగా ఉన్నారు. ఆ ప్రాంతంలో పట్టుగలిగిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా కాంగ్రెస్‌లోనే ఉండడంతో ఇక్కడ పోటీ హోరాహోరీగా మారింది. ఇక వైరాలో మాజీ శాసనసభ్యుడు బానోత్ మదన్‌లాల్ బీఆర్ ఎస్ అభ్యర్థిగా రంగంలో ఉండగా, కాంగ్రెస్ పక్షాన మాలోతు రామదాసు నాయక్ పోటీలో ఉన్నారు. ఇక్కడ కూడా సీపీఎం తన అభ్యర్థి భూక్య వీరభద్రంను పోటీకి నిలిపింది.

జిల్లాలో ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం కావడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రనేతలు విస్తృత పర్యటనలు చేస్తున్నారు . వరసగా బహిరంగ సభలు ఏర్పాటు చేసి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో సభలు నిర్వహించగా , ఈ నెల 21న వైరా , మధిర , నియోజకవర్గాలలో ఆయన సభలు నిర్వహించనున్నారు. కేటీ రామారావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఆదివారం రోడ్‌షో నిర్వహించారు.

రాహుల్ గాంధీ 23 నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ప్రియాంక గాంధీ కూడా ఈ జిల్లాలో రోడ్ షో లో పాల్గొననున్నారు . మొత్తం మీద ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న తరుణంలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ప్రచారం హోరెత్తుతోంది.

పోర్టుల నుంచి ఎయిర్‌పోర్టుల దాకా...

అన్నీ మోదీ గుప్పెట్లోనే: ఖర్గే విమర్శ

జైపూర్: పోర్టుల నుంచి ఎయిర్‌పోర్టుల వరకు అన్నీ ప్రధాని నరేంద్రమోదీ గుప్పెట్లోనే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రజలను బానిసలను చేసే దిశగా మోదీ పాలన సాగుతోందని నిందించారు. రాజస్తాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లా అనుప్‌గఢ్‌లో సోమవారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఖర్గే ప్రసంగించారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందని ఖర్గే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరతామని భరోసా ఇచ్చారు. బీజేపీ తరహాలో నమ్మించి మోసం చేయడం కాంగ్రెస్‌కు చేతకాదన్నారు. 'బహుశా ఈ ప్రాంతంలో ప్రధాని మోదీ పర్యటించి ఉంటారు. మేము ఎక్కడికి వెళ్లాలన్నా మాకు విమానం లేదా హెలికాప్టర్‌పై ప్రయాణానికి అనుమతులు ఇవ్వడం లేదు. అంటే దీనర్థం ప్రతిదీ మోదీ నియంత్రణలోనే ఉంది. ఆకాశం, భూమి, పోర్టులు, విమానాశ్రయాలు వంటి వన్నీ మోదీ గుప్పెట్లో ఉన్నాయి' అని కాంగ్రెస్ అధ్యక్షుడు విమర్శించారు. 'మమ్మలను భయపెట్టాలని చూస్తున్నారు. అయితే మేము భయపడే ప్రసక్తేలేదు. పేదల కోసం మేం పోరాడతాం. పేదల కష్టాలు తొలగిస్తాం' అని ఖర్గే చెప్పారు. రాజస్తాన్‌లోని మొత్తం 200 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబరు 25న పోలింగ్ జరుగుతుంది. డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

ఐదు రాష్ట్రాలు...

రూ.1760 కోట్ల పట్టివేత

ఎన్నికల కమిషన్ వెల్లడి

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ ఇప్పటి వరకు రూ.1760 కోట్ల విలువైన ఉచిత కానుకలు, మాదకద్రవ్యాలు, నగదు, మద్యం, విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలతో పాటు వివధ కానులు పంపిణీ చేస్తున్నాయని తెలిపింది. అక్టోబరు 9వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.1760 కోట్లు పట్టుకున్నామని పేర్కొంది. 2018 ఎన్నికల్లో ఈ ఐదు రాష్ట్రాల్లో కేవలం రూ.239.15 కోట్లు మాత్రమే స్వాధీనం చేసుకున్నామని, ఇప్పుడు ఇది ఏడు రెట్లు పెరిగిందని వివరించింది. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికులు ఇప్పటికే పూర్తయ్యాయి. నవంబరు 25న రాజస్తాన్, 30న తెలంగాణ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇంతకుముందు గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, కర్నాటక ఆరు రాష్ట్రాల ఎన్నికల సమయంలో రూ.1400 కోట్లు స్వాధీనం చేసుకున్నామని, గత ఎన్నికల కంటే ఇది 11 రెట్లు అధికమని ఈసీ ఓ ప్రకటనలో వివరించింది. ఈ ఎన్నికల్లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణా వ్యవస్థ(ఈఎస్ఎంఎస్) ద్వారా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టామని, కేంద్ర, రాష్ట్ర సంస్థలు కలిసికట్టుగా పనిచేశాయని ఈ ప్రకటన తెలిపింది. మిజోరంలో నగదు, విలువైన వస్తువులు ఏవీ లభించలేదని, కానీ రూ.29.82 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు పట్టుబట్టాయని చెప్పింది. వ్యయ పరిశీలకులుగా 228 మంది అధికారులను ఎన్నికల కమిషన్ నియమించింది.

పైలట్ గెలుపు నల్లేరుపై నడకేనా?

ముస్లింలు, గుజ్జర్ల అండ

భవిష్యత్ నేతగా అభిమానుల్లో గుర్తింపు

స్థానికేతరుడంటూ బీజేపీ ప్రచారం



టాంక్: సచిన్ పైలెట్...రాజస్తాన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు. జాతీయస్థాయిలోనూ మంచి గుర్తింపు గల నేత. రాహుల్‌గాంధీ సన్నిహితుల్లో ఒకరు. రాజస్తాన్‌లో మంచి పట్టున్న నేత. గత అసెంబ్లీ ఎన్నికల్లో టాంక్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పైలట్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లోనూ మరోసారి సత్తా చాటాలని కోరుకుంటున్నాడు. మరోవైపు, పైలట్ గెలుపును ఎలాగైనా అడ్డుకోవాలని బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఓ వైపు హిందూత్వను ప్రచారం చేయడంతో పాటు 'స్థానికుడు – స్థానికేతరుడి' నినాదాన్ని తెరపైకి తీసుకొస్తోంది. నియోజకవర్గంలో సచిన్ పైలట్‌కు మంచి బలం ఉంది. చెప్పుకోదగిన అనుచరగణం ఆయన సొంతం. సచిన్ పైలట్‌ను బయటి వ్యక్తిగా బీజేపీ ఈ ఎన్నికల్లో ఎక్కువుగా ప్రచారం చేస్తోంది. గత ఎన్నికల్లో మాదిరిగా సచిన్ పైలట్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థి కాదని, దీనికితోడు స్థానికుడు అంతకన్నా కాదని బీజేపీ అభ్యర్థి అజిత్‌సింగ్ మెహతా ప్రచారం చేస్తున్నారు. తాను నియోజకవర్గానికి చెందిన నాయకుడినని, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలిసిన వాడినని చెప్పుకుంటున్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి అని ప్రచారం చేసుకోవడం వల్ల పైలట్ గెలుపొందారని అంటున్నారు. అయితే, గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి కాకపోయినా...భవిష్యత్ ముఖ్యమంత్రి అభ్యర్థి అని ప్రకటించకపోయినా తమకేమీ బాధలేదని, పైలట్ తమ నాయకుడని ఆయన అనుచరులు పేర్కొన్నారు. 'పైలట్ ముఖ్యమంత్రి అవుతారు. ఈ రోజు కాకపోచ్చు...రూపు కాకపోవచ్చు...ఎల్లుండి కాకపోవచ్చు...భవిష్యత్ ముఖ్యమంత్రి ఆయనే...టాంక్ నియోజకవర్గ ప్రజలు ఇదే మాట్లాడుకుంటున్నారు. ఆయన జాతీయస్థాయి నాయకుడు. మంచి సమర్థుడు. మంచి నాయకుడు' అని ట్రైలర్ మహ్మద్ రిజ్వాన్ అలీ చెప్పాడు. పైలట్‌కు అండగా నిలిచిన ముస్లిం, గుజ్జర్ ఓటు బ్యాంకును కొల్లగొట్టడం కష్టమని మెహతా, బీజేపీకి బాగా తెలుసునని, గుజ్జర్లతో పాటు హిందువులు ఓట్లు సచిన్ పైలట్‌కు పడతాయని కాంగ్రెస్ నేతలు విశ్వసిస్తున్నారు. కాగా, రాజస్తాన్, టాంక్ ఎన్నికలపై లాహోర్ ఆసక్తిగా ఎదురుచూస్తోందని బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి వ్యాఖ్యానించారు. టాంక్ అసెంబ్లీ ఎన్నికల బాధ్యతను బిధూరికి బీజేపీ అప్పగించింది. 25వ తేదీన ఎన్నికలు పూర్తయిన తర్వాత దేశంలోనూ, లాహోర్‌లోనూ లడ్డుల పంపిణీ ఉంటుందా లేదా చూద్దామని బిధూరి అన్నారు. రాజస్తాన్ ఎన్నికలపై పొరుగున ఉన్న శత్రుదేశం కన్నేసి ఉంచిందన్నారు. ఇది మన గుర్తింపునకు ఓ ప్రశ్న అని వ్యాఖ్యానించారు.

భారీ మెజారిటీతో తాను తిరిగి ఎన్నికవుతానని సచిన్ పైలట్ విశ్వాసం వ్యక్తంచేశారు. గత ఎన్నికల మెజారిటీకి ఏమాత్రం తగ్గేది లేదన్నారు. గత ఎన్నికల్లో టాంక్ ప్రజలు తనకు అపూర్వ మద్దతిచ్చారని, ఆశీర్వదించారని, గతంలో ఎన్నడూ చూడనంత అభివృద్ధిని ఈ ఐదేళ్లలో చేశానని పైలట్ వివరించారు. అందుకే ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలుపు నల్లేరు మీద నడకేనని దీమాగా చెప్పారు. 'మేము అద్భుతమైన అభివృద్ధి చేశాం. ఇది అందరి కళ్లకు కనిపిస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాం. ఎవరి పట్ల ఎలాంటి వివక్ష చూపలేదు. గ్రామీణ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాం. ఆరోగ్యం, విద్య, యువత భవిష్యత్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ఈ రంగాల్లో విశేష ప్రగతి సాధించాం' అని సచిన్ పైలట్ పీటీఐతో మాట్లాడుతూ చెప్పారు. ఈ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. గత ఎన్నికల్లో నాలుగు సీట్లకుగాను మూడింటిలో కాంగ్రెస్ గెలిచిందన్నారు. 2018 ఎన్నికల్లో రెండుసార్లు ఎంపీగా పనిచేసిన బీజేపీ అభ్యర్థి యూనస్‌ఖాన్‌పై పైలట్ 54,179 ఓట్లు భారీ మెజారిటీతో గెలిచారు. మరోవైపు, గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఖాన్‌కు తాము మద్దతివ్వలేదని బీజేపీ మద్దతుదారులు చెప్పుకుంటున్నారు. ఈసారి స్థానిక నాయకుడు మెహతా బరిలో నిలిచారని, ఆయన గెలుపుకోసం కృషి చేస్తున్నామని తెలిపారు. టాంక్ నియోజకవర్గంలో ముస్లింలు, గుజ్జర్ల ఆధిపత్యం ఎక్కువ. అయితే, కొంతమంది ముస్లిం నేతలకు పైలట్‌పై అసంతృప్తి కనిపిస్తోంది. అందుకే రెబల్స్‌గా నామినేషన్ సైతం దాఖలు చేశారు. అయితే, సంప్రదింపుల తర్వాత నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. పైలట్ పట్ల కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ పెద్దలు మాట్లాడారని, చివరికి తామంతా ఆయనకే మద్దతుగా నిలిచామని అలీ పీటీఐకి చెప్పారు. ఇ

క్కడ బీఎస్పీ అభ్యర్థి అశోక్ బైర్వా కూడా పైలట్‌కు మద్దతిచ్చారు. తాను పైలట్ తరపున ప్రచారం చేస్తున్నానని, తన నామినేషన్ వెనక్కి తీసుకోవాలని పైలట్ కోరారని, అయితే, సమయం లేకపోవడం వల్ల నామినేషన్ వెనక్కి తీసుకోలేకపోయానని, కానీ పైలట్‌కు మద్దతుగా తాము పనిచేస్తున్నట్లు బైర్వా వివరించారు.

పేద, మధ్యతరగతి ప్రజల బాధలు బీజేపీకి పట్టవు: ప్రియాంక



జైపూర్: బీజేపీ అభ్యర్థులు గతంలో తాము చేసిన పనిని బట్టి ఓట్లు అడిగే పరిస్థితిలో లేరని... కేవలం మతం లేదా కులం పేరుతో ఓట్లు పొందాలని చూస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు. రాజస్తాన్ రాష్ట్రం అజ్మీర్‌లోని కెక్డిలో జరిగిన ర్యాలీలో ప్రియాంక ప్రసంగిస్తూ... వివిధ పార్టీలు చేసిన పనిని బేరీజు వేసుకుని ఓటు వేయాలని ప్రజలను కోరారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా ఎన్నికల రణరంగంలోకి దిగారని... బీజేపీ పూర్తిగా ఛిన్నాభిన్నమైందని ప్రియాంక అన్నారు. రాష్ట్రంలో బీజేపీ తన నాయకులను పక్కన పెట్టిందని, కొత్తవారి కోసం అన్వేషిస్తోందన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చడమే బీజేపీ విధానమని... పేద, మధ్య తరగతి ప్రజల గురించి ఆ పార్టీ ఆలోచించబోదని ఆమె చెప్పారు. రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన అన్ని ప్రజా సంక్షేమ పథకాలను నిలిపివేస్తారని ప్రియాంక హెచ్చరించారు. 200 మంది సభ్యుల రాజస్థాన్ అసెంబ్లీకి నవంబర్ 25న పోలింగ్ జరగనుండగా... డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపడతారు.

సరిహద్దులో పాక్ డ్రోన్ స్వాధీనం

చండీగఢ్: పంజాబ్‌లోని తర్న్ తరన్ జిల్లా భారత్-పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో గల పొలాల్లో పడిపోయిన ఓ డ్రోన్‌ను బీఎస్ఎఫ్ సిబ్బంది సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దుల నుంచి హెరాయిన్ అక్రమ రవాణాకు ఉపయోగించిన పాక్‌కు చెందిన 8 మానవరహిత ఏరియల్ వాహనాలను గడచిన వారం రోజుల్లో స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెప్పారు.

స్పష్టమైన సమాచారం అందడంతో పంజాబ్ పోలీసులు, బీఎస్ఎఫ్ సంయుక్తంగా సరిహద్దు పొలాల్లో గాలింపు జరిపాయని, అక్కడ కూలిన డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. చైనా తయారీ క్వాడ్ కాప్టర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గడచిన వారం రోజుల్లో 8 పాకిస్తాన్ డ్రోన్లు, 5 కిలోల హెరాన్‌ను బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కరువు సాయం ఇవ్వలేదు

కేంద్రంపై సిద్ధరామయ్య విమర్శ

విజయపుర: కర్నాటకకు కరువు సాయంగా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు సాయం అందించాలని, ఉపాధి పని దినాలను పెంచాలని కోరుతూ తాను రాసిన లేఖలకు సైతం కేంద్రం నుంచి ఇంతవరకు సమాధానం లేదన్నారు. రాష్ట్రంలోని మొత్తం 236 తాలూకాల్లో 223 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా కర్నాటక ప్రభుత్వం ప్రకటించింది. ఈ స్థితిలో తాగునీటి సరఫరా, పశుగ్రాసం, ప్రజలకు ఉపాధి కల్పన వంటి అన్ని కరువు నివారణ పనులను ప్రారంభించామని సిద్ధరామయ్య చెప్పారు.

సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల దృష్ట్యా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద ఉపాధి పని దినాలను ఏడాదికి 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని నిర్ణయించామని, అయితే కేంద్ర ప్రభుత్వం దీనికి అనుమతి ఇవ్వాల్సి ఉందన్నారు.

కేంద్రానికి లేఖ రాసినా నేటికీ ఎలాంటి సమాధానం రాలేదన్నారు. కరువు రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరుతూ తమ ప్రభుత్వం కరువు మెమోరాండం సమర్పించి నెల రోజులు దాటిందని, ఆ తర్వాత కేంద్ర బృందం కూడా రాష్ట్రానికి వచ్చి పరిశీలన చేసినప్పటికీ నేటికీ ఒక్క పైసా కూడా ఇవ్వలేదని సిద్ధరామయ్య అన్నారు.

రాష్ట్రానికి కరువు సహాయ నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయడంపై కర్నాటక మంత్రివర్గం గత గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కరువు నిధుల విషయమై సిద్ధరామయ్య గత వారం కూడా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌లకు లేఖలు రాశారు. కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు నిబంధనలను మార్చాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా దానికి కూడా సమాధానం లేదని సీఎం మీడియా దృష్టికి తెచ్చారు.

సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తప్పించేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కుట్ర పన్నుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర చేసిన ఆరోపణలపై స్పందిస్తూ... 'మా పార్టీ సమస్యలను మేం చూసుకుంటాం' అన్నారు.

చిక్కుకున్న కార్మికుల్లో మనోధైర్యం పెంచాలి

ప్రధాని మోదీ

ఉత్తరాఖండ్ సొరంగాన్ని సందర్శించిన విదేశీ నిపుణులు

న్యూఢిల్లీ: సిల్క్యారా టన్నెల్‌లో చిక్కుకున్న 41 మంది కార్మికులను రక్షించేందుకు సహాయక ఆపరేషన్‌ను సమీక్షించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సోమ వారం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో మాట్లాడారు. వారి మనోధైర్యాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఒక అంతర్జాతీయ టన్నెలింగ్ నిపుణుడు, ఆర్నాల్డ్ డిక్స్ ఇప్పుడు తొమ్మిదవ రోజు సహాయక చర్యలను సమీక్షించడానికి విపత్తు స్థలానికి చేరు కున్నారు. డిక్స్ జెనీవాకు చెందిన ఇంటర్నేషనల్ టన్నెలింగ్, అండర్ గ్రౌండ్ స్పేస్ అసోసియేషన్‌కు అధిపతిగా ఉన్నారు. కాగా, అవసరమైన సహాయ పరికరాలు, వనరులను కేంద్రం అందజేస్తోందని, కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య పరస్పర సమన్వయం ద్వారా చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా రక్షిస్తామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం ప్రధాని మోదీ తెలిపారు. చిక్కుకుపోయిన కార్మికుల మనోధైర్యాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు. సొరంగం వద్ద జరుగుతున్న సహాయక చర్యల గురించి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి ధామితో మాట్లాడడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా సీఎం ధామి సహాయక ఆపరేషన్ల గురించి ప్రధాని మోదీకి వివరించారు. చిక్కుకున్న కార్మికులందరికీ ఆక్సిజన్, పౌష్టికాహారం, నీరు నిరంతరం సరఫరా చేయడంతో సురక్షితంగా ఉన్నారని చెప్పారు. సహాయక చర్యలు చేపట్టేందుకు నిపుణులతో సంప్రదింపులు జరుపుతూ అన్ని సంస్థలు పరస్పరం పూర్తి సమన్వయంతో పని చేస్తున్నాయని, తాను ఘటనాస్థలిని పరిశీలించానని, సహాయక ఆపరేష న్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నానని ఆయన వివరించారు. చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా తరలిస్తారని డిక్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. 'అపారమైన పని' జరిగిందని పేర్కొంటూ, ఇప్పటివరకు చేసిన రెస్క్యూ ప్రయత్నాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశాడు. 'మేము చేసేది సురక్షితంగా ఉందని, తరలించాల్సిన వ్యక్తులు సురక్షితంగా ఉన్నారని నిర్ధారించుకోవడానికి మేము ప్రస్తుతం చాలా పని చేస్తున్నాము. నేను ఇప్పుడు సొరంగంలో ఉన్నాను. అక్కడ

అపారమైన పని జరిగింది. మేము ఇతర అవకాశాలను పరిగణన లోకి తీసుకోవడానికి పర్వతం పైభాగంలోకి వస్తున్నాము' అని డిక్స్ చెప్పారు. 'నేను ఆదివారం మాత్రమే వచ్చాను. కానీ నిన్న, ఈ రోజు మధ్య కూడా నేను చూసిన పని అసాధారణమైనది. ఈ రోజు ప్రణాళిక కార్మికులను బయటకు తీసుకురావడానికి ఉత్తమమైన పనిని చేస్తోంది' అని అతను తెలిపారు. అయితే డిక్స్ సహాయ ఆపరేషన్ ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేదు. వైద్య బృందాలు కూడా సొరంగం ప్రాంతంలో ఉన్నాయని, ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) నుంచి వచ్చిన బృందం కూడా ఘటనా స్థలిలోనే సమీక్ష కోసం సొరంగంను సందర్శించిన తర్వాత కార్యకలాపాలపై నిఘా ఉంచుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. నవంబరు 12న కొండచరియలు విరిగిపడటంతో చార్ ధామ్ ఆల్-వెదర్ రోడ్డులో భాగమైన సొరంగం భాగాలు కూలిపోయి, 41 మంది కార్మికులు భారీ శిథిలాల కింద చిక్కుకున్నప్పటి నుంచి సహాయ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఉత్తరకాశీ జిల్లాలోని సిల్క్యారా సొరంగం వద్ద చిక్కుకున్న 41 మంది కార్మికుల బంధువుల ప్రయాణ, ఆహారం, వసతి ఖర్చులను ఉత్తరాఖండ్ ప్రభుత్వం భరిస్తుందని సీఎం ధామి సోమవారం తెలిపారు. చిక్కుకుపోయిన కార్మికుల కుటుంబాలను త్వరలోనే కాపాడుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, వారి బంధువులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చూడాలని కోరారు. చిక్కుకున్న కార్మికుల మనోధైర్యాన్ని కాపాడేందుకు సైకియాట్రిస్టులను కూడా రంగంలోకి దింపినట్లు ఆయన తెలిపారు. సిల్క్యారా సొరంగం ఉత్తరకాశీ జిల్లా ప్రధాన కేంద్రం నుంచి 30 కి.మీ దూరంలో ఉంది. డెహ్రాడూన్ నుంచి ఏడు గంటల ప్రయాణం.

అందరివాడు అంబేడ్కర్

విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అందరినీ ఆహ్వానించాలి: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: నవభారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడనీ, విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహావిష్కరణకు అందరినీ ఆహ్వానించాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ మేధావి, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అహరహం శ్రమించిన, అన్ని రాజకీయ, ప్రజాసంస్థల మన్ననలు చూరగొన్న నేత అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని మహానగరం విజయవాడలో నిర్మించి ఆవిష్కరణకు సన్నాహాలు చేయడం పట్ల విల్సన్ హర్షం వెలిబుచ్చారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విగ్రహావిష్కరణ జరపనున్నారనే వార్త తెలుసుకున్న విల్సన్ విగ్రహ నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని ప్రజాసంఘాల బృందంతో సందర్శించారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విగ్రహావిష్కరణ మహోత్సవంలో అన్ని రాజకీయ పార్టీలను, దళిత, ప్రజాసంఘాలను తగు రీతిలో పాల్గొనేటట్లు జాగ్రత్త వహించడం ద్వారా రాజకీయాలకు అతీతంగా సామాజిక న్యాయం కోసం తపించిన మహనీయుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ సాగించిన మహోద్యమానికి గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు కృషి చేయాలని జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్.వెంకట్రావు, కాబోతు ఈశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, నాయకులు సంగుల పేరయ్య, కొడాలి ఆనందరావు, కొంపల్లి కృష్ణ, లింగాబత్తిన శివకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారత జర్నలిస్ట్ కె.కె.షాహినాకు ఇంటర్నేషనల్ ప్రెస్ ఫ్రీడమ్ అవార్డు

న్యూఢిల్లీ : భారత జర్నలిస్టు, ఔట్‌లుక్ మ్యాగజైన్ సీనియర్ ఎడిటర్ కె.కె.షాహినాను జర్నలిస్టుల పరిరక్షణ కమిటీ (సీపీజే) ఈ సంవత్సరం ఇంటర్నేషనల్ ప్రెస్ ఫ్రీడమ్ అవార్డుతో సత్కరించింది. తెహల్కా మ్యాగజైన్‌లో పనిచేసినందుకు క్రూరమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద అభియోగాలు మోపబడిన మొదటి భారత జర్నలిస్టులలో షాహినా ఒకరు అని సీపీజే పేర్కొంది. '2010లో ప్రారంభించబడిన ఒక కేసు విచారణ కోసం వేచి ఉన్నప్పటికీ, ఆమె వివిధ పోస్టులలో తన రిపోర్టింగ్‌ను కొనసాగించారు. కర్నాటక రాష్ట్రంలోని స్థానిక ప్రభుత్వ అధికారులు ఆమె ఆ సమయంలో పనిచేసిన ప్రముఖ పరిశోధనా పత్రిక తెహెల్కాలో ప్రచురించిన తన కథనాన్ని నేరంగా పరిగణించాలని ప్రయత్నించారు. 2008లో బెంగళూరులో జరిగిన బాంబు పేలుళ్లపై పోలీసుల విచారణపై ఆమె కథనం అనుమానం వ్యక్తం చేసింది. స్థానిక ముస్లిం మతపెద్దను అరెస్టు చేసేందుకు పోలీసులు కల్పిత సాక్షుల వాంగ్మూలాలను రూపొందించారని ఆరోపించింది. ఆమె నేరపూరిత బెదిరింపు, నేరపూరిత చర్యకు పాల్పడే ఉద్దేశం, నేరపూరిత కుట్రతో సహా మూడు నేరారోపణలను శిక్షాస్మృతి కింద ఎదుర్కొంటుంది. సాక్షులను బెదిరించడానికి సంబంధించిన 'ఉపా' కింద ఒక నేరాన్ని ఎదుర్కొంటుంది. జూన్ 2023 నాటికి బెయిల్‌పై ఉన్న షాహినాపై విచారణ పెండింగ్‌లో ఉంది. నేరం రుజువైతే, ఆమెకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా ఉంటుంది.

పంట వ్యర్థాలు తగులబెట్టిన

రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి

పంజాబ్ వ్యాప్తంగా రైతు సంఘాల నిరసన

అమృత్‌సర్/లూథియానా/హోషియార్‌పూర్: పంట వ్యర్థాలను తగులబెట్టిన రైతులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ పంజాబ్‌లోని అనేక రైతు సంఘాలు సోమవారం రాష్ట్రంలోని అనేక చోట్ల డిప్యూటీ కమిషనర్లు, సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టాయి. వరి గడ్డికి సంబంధించి దీర్ఘకాలిక పరిష్కారాన్ని కోరుతూ నిరసన తెలిపిన రైతులు... డిప్యూటీ కమిషనర్లు, సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్‌లకు చెందిన అనేక కార్యాలయాలకు వరి గడ్డితో కూడిన ట్రాలీలను తీసుకువచ్చారు. నాలుగు గంటల నిరసనకు సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), 18 ఇతర రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఎఫ్ఐఆర్‌ల నమోదుతో సహా పంట వ్యర్థాలను తగులబెట్టిన రైతులపై విధించిన జరిమానాను వెనక్కి తీసుకోవాలని, ఆందోళన చేస్తున్న రైతులు చట్టపరమైన చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చెరకు రేట్లు పెంచాలని, భారతమాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, మోగాలో ట్రాక్టర్ ట్రాలీలలో పంట వ్యర్థాలను తీసుకువస్తున్న రైతుల బృందం 'ధర్నా' చేసినందుకు డీసీ కార్యాలయ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారని రైతులు చెప్పారు. డీసీ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు తమను అనుమతించాలని డిమాండ్ చేస్తూ ఓ రైతు పోలీసు వాహనం ముందు నిల్చొని 'ఈ పంట వ్యర్థాలను మేము ఎక్కడికి తీసుకువెళ్లాలి?' అని ప్రశ్నించారు. గడ్డిని తగులబెట్టినందుకు రైతులపై చట్టపరమైన చర్యలను ఖండిస్తూ నిరసనకారులు, పరిశ్రమలు, వాహనాల వల్ల 75 నుంచి 80 శాతం కాలుష్యం ఏర్పడిందని తెలిపారు. అయితే రైతులపై చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. సంగ్రూర్‌లో రైతులు తమ ట్రాక్టర్ ట్రాలీలలో వరి గడ్డిని తీసుకొచ్చి డీసీ కార్యాలయం దగ్గర వాహనాలను నిలిపివేశారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి సర్వన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 34 చోట్ల ప్రదర్శనలు నిర్వహించామన్నారు. రైతులపై విధించిన జరిమానాలను ఉపసంహరించుకోవాలని, పంట వ్యర్థాల నిర్వహణకు దీర్ఘకాలిక పరిష్కారం చూపాలని కోరారు. లూథియానాలో నిరసన తెలుపుతున్న రైతులను నగరంలోకి అనుమతించలేదు. వర్కా మిల్క్‌ప్లాంట్ చౌక్ వద్ద, సంగోవాల్ గ్రామ సమీపంలో రెండు గ్రూపుల రైతులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మినీ సచివాలయానికి చేరుకున్న రైతుల బృందం అదనపు డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందించింది. హోషియార్‌పూర్‌లో ఆజాద్ కిసాన్ కమిటీ దోబా బ్యానర్ అధ్వర్యంలో రైతులు పంటల వ్యర్థాలను తగులబెట్టిన రైతులపై శిక్షార్హమైన చర్యలకు వ్యతిరేకంగా 'ధర్నా' నిర్వహించారు. ఆజాద్ కిసాన్ కమిటీ దోబా అధ్యక్షుడు హర్‌పాల్ సింగ్ సంఘా అధ్వర్యంలో రైతులు జిల్లా పరిపాలనా సముదాయం ఎదుట గుమిగూడారు.

భారత్ ఓటమితో యువకుడి ఆత్మహత్య

బంకుర: ఆస్ట్రేలియాతో ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఓటమి చెందడంతో మనస్తాపానికి గురై 23 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాహుల్ లోహర్ అనే యువకుడు బట్టల దుకాణంలో పనిచేస్తాడు. క్రికెట్ అంటే పిచ్చి. ఫైనల్ మ్యాచ్ చూడటానికి ఆదివారం సెలవు పెట్టాడు. అయితే, తుది పోరులో భారత్ ఓటమి చెందడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన గదిలోనే ఉరివేసుకొని చనిపోయాడని అతని బావ ఉత్తమ్ చెప్పాడు. రాహుల్‌కు ఎలాంటి సమస్యలు లేవని స్పష్టంచేశారు. రాహుల్ ఉరివేసుకునే సమయంలో ఇంట్లో ఎవరూ లేరని పోలీసులు చెప్పారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సీపీఐ 30గంటల నిరసన దీక్ష దృశ్యమాలిక

దీక్షలో మాట్లాడుతున్న ఏ.ఐ.కె.ఎస్. అధ్యక్షులు రావుల వెంకయ్య. వేదికపై వరుసగా రామ చంద్రయ్య, దేగా, ఓబులేసు, ముప్పాళ్ల, రామకృష్ణ, నాగభూషణం, విల్సన్, జంగాల, జగదీశ్, వనజ తదితరులు

దీక్షాస్థలిలోనే నిద్రించిన రామకృష్ణ, ఇతర నాయకులు

మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు, పద్మశ్రీ, నరసింహారావు తదితరులు

అభ్యుదయ గేయాలను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

ప్రజానాట్యమండలి కళా ప్రదర్శన

ఐసీసీ జట్టులో ఆరుగురు భారత ఆటగాళ్లు

లండన్: వన్డే ప్రపంచ కప్‌లో అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించిన ఆటగాళ్లతో కూడిన జట్టును అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. అందులో ఏకంగా ఆరుగురు భారత ఆటగాళ్లే కావడం విశేషం. వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ ఓడించి... ఆసీస్ విజేతగా నిలిచినప్పటికీ ఆ జట్టులో కేవలం ఇద్దరికి మాత్రమే ఐసీసీ చోటు కల్పించింది. ఇక పన్నెండో ఆటగాడిగా దక్షిణాఫ్రికా పేస్ సంచలనం గెరాల్డ్ కొయిట్జీని ఎంపిక చేసింది.

ఐసీసీ ఎంపిక చేసిన జట్టు ఇదే...

- క్వింటన్ డికాక్ (దక్షిణాఫ్రికా): 10 మ్యాచుల్లో 594 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి.
- రోహిత్ శర్మ (భారత్): 11 మ్యాచుల్లో 597 పరుగులు చేశాడు. ఒక సెంచరీ ఉంది.
- విరాట్ కోహ్లి (భారత్): ప్రపంచకప్ టోర్నీలోనే అత్యధిక పరుగులు చేశాడు. మొత్తం 11 మ్యాచుల్లో 765 పరుగులు చేశాడు. ఇందులో మూడు శతకాలు ఉన్నాయి. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు.
- డారిల్ మిచెల్ (న్యూజిలాండ్): కివీస్ టాప్ ఆర్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్ 10 మ్యాచుల్లో 552 పరుగులు సాధించాడు. రెండు సెంచరీలు నమోదు చేశాడు.
- కేఎల్ రాహుల్ (భారత్): భారత మిడిలార్డర్‌లో కీలక ఆటగాడు. 11 మ్యాచుల్లో 452 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ ఉంది.
- గ్లెన్ మ్యాక్స్‌వెల్ (ఆస్ట్రేలియా): డబుల్ సెంచరీ చేసిన గ్లెన్ మ్యాక్స్‌వెల్ 9 మ్యాచుల్లో 400 పరుగులు చేశాడు. బౌలింగ్‌లోనూ ఆరు వికెట్లు పడగొట్టాడు.
- రవీంద్ర జడేజా (భారత్): స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఈ టోర్నీలో 20 వికెట్లు తీశాడు.
- దిల్షాన్ మదుషంక (శ్రీలంక): సంచలన యువ బౌలర్ టోర్నీలో అదరగొట్టాడు. కేవలం 9 మ్యాచుల్లోనే 21 వికెట్లు పడగొట్టాడు. భారత్‌పై ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.
- ఆడమ్ జంపా (ఆస్ట్రేలియా): ఈ ఆసీస్ స్పిన్నర్ 11 మ్యాచుల్లో 23 వికెట్లు తీశాడు. మెగా టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్.
- మహమ్మద్ షమీ (భారత్): సంచలన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కకావికలం చేశాడు. టాప్ వికెట్ టేకర్ కూడా షమీనే. కేవలం 7 మ్యాచుల్లోనే 24 వికెట్లు తీశాడు.
- గెరాల్డ్ కొయిట్జీ (దక్షిణాఫ్రికా): ఇతడిని ఐసీసీ 12వ ఆటగాడిగా ఎంపిక చేసుకుంది. దక్షిణాఫ్రికా పేసర్ కొయిట్జీ 8 మ్యాచుల్లో 20 వికెట్లు తీశాడు.

టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌కు మోదీ...ఆటగాళ్లకు ఓదార్పు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మరోసారి ప్రపంచ చాంపియన్స్‌గా అవతరించడంలో విఫలమైంది. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా ఆస్ట్రేలియా చేతిలో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. టోర్నీ ఆద్యంతం టీమ్ ఇండియా అద్భుతంగా ఆడింది. ఈ ఓటమితో మొత్తం జట్టు నిరాశ చెందింది. భారత జట్టు వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచి ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ టైటిల్ మ్యాచ్‌ను గెలవలేకపోయింది.

ఈ మ్యాచ్ చూసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా వచ్చారు. భారత జట్టు ఓటమి తర్వాత, ప్రధాని మోదీ టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లను కలుసుకున్నారు. ఈ సమయంలో ఆటగాళ్లంతా భావోద్వేగంతో కనిపించారు. ఈ క్రమంలో టీమిండియా ఆటగాళ్లను ప్రధాని మోదీ తన మాటలతో స్థైర్యాన్ని నింపారు. షమీ తన సోషల్ మీడియాలో మోదీని కౌగిలించుకున్న ఫొటోను పోస్ట్ చేశాడు. ఈ ఫొటోతో పాటు క్యాప్షన్‌లో, డ్రెస్సింగ్ రూమ్‌కి వచ్చి జట్టు ఆటగాళ్లను ఉత్సాహపరిచినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపాడు. భారత జట్టు స్పిన్నర్ రవీంద్ర జడేజా కూడా ప్రధాని మోదీతో దిగిన ఫొటోను షేర్ చేశాడు. టీమిండియా టోర్నీ ఆసాంతం బాగా ఆడిందని, అయితే ఫైనల్స్‌లో జట్టు రాణించలేకపోయిందంటూ జడేజా రాసుకొచ్చాడు. దీంతో జట్టు నిరాశ చెందిందని, ఇటువంటి పరిస్థితిలో ప్రధాని మోదీ డ్రెస్సింగ్ రూమ్‌కి వచ్చి జట్టు ఆటగాళ్లను కలిశారని, ఇది చాలా ప్రేరణ కలిగించిందంటూ అందులో పేర్కొన్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.